# మనజనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

సంపుటి : 6 సంచిక : 225 పేజీలు : 8 వెల : రూ.2/- బుధవారం 09 సెప్టెంబర్ 2026 వైయస్ఆర్ కడప

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool




## రూ.35 వేల కోట్ల ప్రాజెక్టులు ప్రారంభం..

- విమర్శకులపై మోడి 'నారాజ్ ఫూఫాజీ' పంచ్
- ప్రధాని సభా ప్రాంగణంలో భద్రతా వైఫల్యం..
- నకిలీ అధికారి అరెస్ట్, తుపాకీ స్వాధీనం..!

**వడోదర:మన జనప్రగతి సెప్టెంబర్ 08:** తన ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రశ్నించే ప్రతిపక్షంపై ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. విమర్శ కులను ఉద్దేశించి ఇటీవల ఉపయోగిస్తున్న 'నారాజ్ ఫూఫాజీ' (కోపంగా ఉన్న మామయ్య) పదాన్ని మరోసారి ప్రస్తావించారు. గుజరాత్‌లోని వడోదరలో మంగళవారం నిర్వహించిన 'నమో ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో రూ.35 వేల కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ ప్రాజెక్టుల్లో 2,800 కిలోమీటర్ల పొడవైన డెడికేటెడ్ రైల్ ఫ్రైట్ కారిడార్ కూడా ఉంది. దీనిని 21వ శతాబ్దపు చారిత్రక విజయంగా మోదీ అభివర్ణించారు.బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల పనితీరును పోల్చుతూ ఫ్రైట్ కారిడార్ ప్రాజెక్టును మోదీ ప్రస్తావించారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి మిగతా2లో...

# అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- సోషల్ మీడియాను యాక్టివ్‌గా వాడాలి
- టీడీపీ నేతలకు నారా లోకేశ్ దిశానిర్దేశం



**అమరావతి,మన జనప్రగతి సెప్టెంబర్ 08:** తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో రెండో రోజు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నేతలను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. 'పొలిటికల్ కమ్యూనికేషన్ అండ్ పబ్లిక్ ఓరియంటేషన్' అనే అంశంపై మాట్లాడుతూ, ఆయన నేరుగా సభికులను "మీలో ఎంతమంది సోషల్ మీడియాను చురుకుగా వినియోగిస్తున్నారు?" అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నతోనే సాంకేతికతను రాజకీయ ప్రచారానికి వాడుకోవాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు. "సోషల్ మీడియానే కదా అని తేలిగ్గా తీసుకోవద్దు. దీనిపై చాలా సీరియస్‌గా ఉండాలి" అని లోకేశ్ నేతలకు స్పష్టం చేశారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు చేరవేయాలని ఆయన సూచించారు. చిన్న స్థాయి నాయకులైన ఏఎంసీ, కార్పొరేషన్ ఛైర్మన్లు కూడా తాము చేస్తున్న పనులను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు వివరిస్తున్నారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీని ఆయన ఉదాహరణగా చూపారు. ప్రధాని మోదీ సైతం తన సందేశాలను సెల్ఫీ వీడియోల ద్వారా ప్రజలకు చేరవేస్తున్నారని లోకేశ్ పేర్కొన్నారు. తాను కూడా సుజ్లాన్ విండ్ ప్రాజెక్టు శంకుస్థాపన, డీఎస్సీపై జరుగుతున్న దుష్ప్రచారం వంటి అంశాలపై సెల్ఫీ వీడియోలు తీసి వాస్తవాలను ప్రజల ముందు ఉంచానని తెలిపారు. విషయం చిన్నదైనా, పెద్దదైనా ప్రజలకు నిజాలు తెలియజేయాల్సిన బాధ్యత నేతలపై ఉందని అన్నారు. ప్రతిపక్షాల తీరుపై లోకేశ్ తీవ్రంగా స్పందించారు. ప్రతిపక్షం పని కేవలం ప్రభుత్వంపై బురదజల్లడమేనని, వారి దుష్ప్రచారాన్ని సోషల్ మీడియా వేదికగా ఎప్పటికప్పుడు మిగతా2లో...

## తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు..



**హైదరాబాద్ మన జనప్రగతి సెప్టెంబర్ 08:** తెలుగు రాష్ట్రాల్లో మంగళవారం తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. తెలంగాణలో అనేక జిల్లాల్లో ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్, ఉత్తర జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా, రాయలసీమ ప్రాం తాల్లో మెరుపులు, బలమైన గాలులతో కూడిన వర్షాలు, ఉత్తర కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. మత్స్య కారులు తీరప్రాంతంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## సామాన్యులకు ఊరట కల్పించేలా చర్యలు

- కిలో ఉల్లిగడ్డలు 32 రూపాయలే...
- వచ్చే వారం నుంచి రైతు బజార్లలో లభ్యం
- ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి



**అమరావతి,మన జనప్రగతి సెప్టెంబర్ 08:** ఆంధ్రప్రదేశ్‌లో నిత్యావసరాల ధరల పెరుగుదలతో ఇబ్బంది పడుతున్న సామాన్య ప్రజలకు కూటమి ప్రభుత్వం ఊరట కల్పించే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. వంటింటి భారాన్ని తగ్గించే లక్ష్యంతో, కిలో ఉల్లిపాయలను కేవలం రూ.32కే రాయితీపై అందించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం సోషల్ మీడియా ద్వారా వివరాలు వెల్లడించారు. వచ్చే వారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 115 రైతు బజార్లు, ప్రత్యేక మొబైల్ కౌంటర్ల ద్వారా ఈ రాయితీ ఉల్లిపాయల మిగతా2లో...

## ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌లకు సస్పెన్షన్

- సెషన్ మొత్తానికి సస్పెన్షన్ వేటు
- ఇద్దరు ఎమ్మెల్సీలపై చర్యలకు తీర్మానం




## స్పీకర్‌ను పరామర్శించిన సీఎం రేవంత్..




## శాఖలను సమూలంగా మార్చాలని అధిష్టానానికి చెప్పా...

- నాకు మంత్రి పదవి ఇవ్వడం అధిష్ఠానం నిర్ణయం

- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడి




## వైసీపీకి రాజీనామా చేసిన బొత్స మేనల్లుడు



మనజనప్రగతి

09- 09 - 2026

# రూ.35 వేల కోట్ల ప్రాజెక్టులు ప్రారంభం..

(మొదటి పేజీ తరువాయి)

హయాంలో ఈ ప్రాజెక్టు ఆలోచనకు రూపకల్పన జరిగినప్పటికీ.. యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో పెద్దగా పురోగతి సాధించలేదని అన్నారు. ఫ్రైట్ కారిడార్ ప్రాజెక్టును 2004లో ప్రతిపాదించారు. కానీ 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చే వరకు దానిపై పెద్దగా ముందడుగు పడలేదు అని చెప్పారు. ఈ ప్రాజెక్టు వల్ల ప్రయోజనం ఏమిటని ప్రశ్నించే వారిపై వ్యంగ్యంగా స్పందిస్తూ.. ఒక నారాజ్ ఫూఫాజీ.. 'ట్రక్ డ్రైవర్లు ఏం చేస్తారు?' అని అడుగుతుంటారు. ఫూఫాజీకి ఇప్పుడు పని దొరికింది అని వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా రైల్వే కనెక్టివిటీ లేని ప్రాంతాలకు ఈ ఫ్రైట్ కారిడార్ అనుసంధానాన్ని తీసుకెళ్తోందని మోదీ చెప్పారు. దేశీయ సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడం, ఆత్మనిర్భరతను పెంచడంలో భాగంగానే ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు తెలిపారు. యూపీఏ ప్రభుత్వంపై మరోసారి విమర్శలు గుప్పిస్తూ.. 2014 తర్వాత భారత్ 50 వేల ఆధునిక రైల్వే కోచ్‌లను తయారు చేసింది. గత ప్రభుత్వం పదేళ్లలో కనీసం 50 వేల మరుగుదొడ్లను కూడా నిర్మించలేకపోయింది అని అన్నారు. భారత్ ఇప్పుడు 'చిప్ నుంచి షిప్' వరకు దేశీయ తయారీపై దృష్టి సారిస్తూ కొత్త పారిశ్రామిక యుగంలోకి అడుగుపెడుతోందని చెప్పారు. విడిభాగాల నుంచి తుది ఉత్పత్తుల వరకు దేశంలోనే తయారుచేసే విధంగా తయారీ రంగాన్ని విస్తరిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని విమర్శించే వారిని ఉద్దేశించి మోదీ ఉపయోగిస్తున్న వ్యంగ్య పదజాలంలో 'నారాజ్ ఫూఫాజీ' తాజాగా చేరింది. గత వారం ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ శతాబ్ది వేడుకల్లో ఆయన తొలిసారి ఈ పదాన్ని ఉపయోగించారు. యువతను ఆకట్టుకునేలా 'జెన్ జెడ్' పదజాలంతో చేసిన ప్రసంగంలో భాగంగా ఈ వ్యాఖ్య చేశారు. 202627 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో భారత్ సాధించిన అంచనాలకు మించిన 7.8 శాతం జీడీపీ వృద్ధిని ప్రశ్నించిన వారిని ఉద్దేశించి అప్పట్లో మోదీ ఈ పదాన్ని ఉపయోగించారు. ప్రభుత్వ కార్యక్రమాలను వ్యతిరేకించడాన్నే కొందరు 'ఆట'గా మార్చుకున్నారని విమర్శించారు. మోదీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే స్పందించారు. ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రధాని ప్రతి ఏడాది కొత్త పదజాలాన్ని తీసుకొస్తున్నారని విమర్శించారు. నారాజ్ ఫూఫా, దిమాగీ నక్సల్, అర్బన్ నక్సల్, ఖాన్ మార్కెట్ గ్యాంగ్, ఆందోళన్‌జీవి, పరజీవి.. పదాలు మారుతూనే ఉంటాయి. కానీ మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు మాత్రం మారవు అని ఖర్గే 'ఎక్స్'లో పేర్కొన్నారు. నకిలీ పీఎంవో అధికారి.. తుపాకీతో 'బాడీగార్డ్' అరెస్ట్ ప్రధాని నరేంద్ర మోదీ కార్యక్రమానికి ఒక రోజు ముందు ముంబైలో నకిలీ పీఎంవో అధికారిగా చెప్పుకున్న ఓ వ్యక్తి, తుపాకీతో ఉన్న అతని బాడీగార్డ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. జియో వరల్డ్ ప్లాజాలో సోమవారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. అయితే దీనికి ప్రధాని మోదీ పర్యటనతో ఎలాంటి సంబంధం లేదని ముంబై పోలీసులు స్పష్టం చేశారు. డ్రోన్ టెక్నాలజీ వ్యాపారం నిర్వహిస్తున్నట్లు చెబుతున్న 28 ఏళ్ల రోహన్ పారేఖ్ జియో వరల్డ్ ప్లాజాలోకి ప్రవేశించాడు. ఆ సమయంలో ప్రధాని కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. కొద్దిసేపటి తర్వాత అతని బాడీగార్డ్ దిలీప్ కుండే అక్కడికి వచ్చాడు. మెటల్ డిటెక్టర్‌లో తుపాకీ ఉన్నట్లు గుర్తించడంతో భద్రతా సిబ్బంది అతడిని అడ్డుకున్నారు. దీంతో కుండే ఫోన్ చేయగా పారేఖ్ అక్కడికి తిరిగి వచ్చాడు. ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంవో) జారీ చేసినట్లుగా కనిపిస్తున్న గుర్తింపు కార్డును భద్రతా సిబ్బందికి చూపించాడు. అందులో పారేఖ్‌ను 'గ్రేడ్- సీ అధికారి'గా పేర్కొన్నారు. అయితే కార్డుపై జారీ చేసిన తేదీ ఉన్నప్పటికీ చెల్లుబాటు వ్యవధి లేదు. అలాగే జారీ చేసిన అధికారిగా భావిస్తున్న వ్యక్తి సంతకం ఉన్నా.. ఆయన హోదా పేర్కొనలేదు. దీంతో కార్డు అసలైనదేనా అన్న అనుమానాలు తలెత్తాయి. పారేఖ్, కుండేను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం కుండే వద్ద ఉన్న తుపాకీకి లైసెన్స్ ఉన్నట్లు గుర్తించారు. పారేఖ్‌ను కోర్టులో హాజరుపరచగా.. అతన్ని 11 వరకు పోలీసు కస్టడీకి పంపింది. ఈ కేసుతో సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్న మూడో వ్యక్తి ప్రథమేశ్ బాగుల్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. తన క్లయింట్‌ను ఎవరో మోసం చేసి, తాను పీఎంవో సలహాదారుగా నియమితుడయ్యానని నమ్మించారని పారేఖ్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. పారేఖ్‌కు నియామక పత్రాలుగా కనిపించే కొన్ని పత్రాలు, అధికారికంగా కనిపించే ఈమెయిళ్లు, గుర్తింపు కార్డుకు సంబంధిం చిన స్క్రీన్‌షాట్ లభించాయని చెప్పారు. అయితే అసలు గుర్తింపు కార్డు మాత్రం ఆయనకు ఇవ్వలేదన్నారు. అంతేకాకుండా బాడీగార్డ్‌ను నియమించుకోవాలని కూడా సూచించినట్లు తెలిపారు. తనతో నిశ్చితార్థం అయిన యువతికి పెర్ఫ్యూమ్ కొనుగోలు చేసేందుకు మాత్రమే పారేఖ్ మాల్‌కు వెళ్లారని, దర్యాప్తు అధికారులను సంప్రదించిన తర్వాత ఆయన పూర్తిగా సహకరించారని న్యాయవాది తెలిపారు. సంబంధిత పత్రాలు, కమ్యూనికేషన్ వివరాలను పారేఖ్ ఇప్పటికే దర్యాప్తు సంస్థలకు అందించారని చెప్పారు. ప్రభుత్వ అధికారిగా తప్పుడు గుర్తింపు పొందడం తదితర నేరాలకు సంబంధించిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ల కింద బీకేసీ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ముంబై క్రైమ్ బ్రాంచ్ సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించడంతో పాటు పారేఖ్ సమర్పించిన పత్రాలు, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్లను ధ్రువీకరిస్తోంది. పీఎంవోకు సంబంధించినవిగా చూ పించిన గుర్తింపు పత్రాలు, ఇతర ఆధారాలు ఎక్కడి నుంచి వచ్చాయన్నదానిపైనా దర్యాప్తు చేస్తున్నారు. పారేఖ్‌కు ఈ పత్రాలు నకిలీవని తెలిసినా వాటిని ఉప యోగించాడా? లేక అతడే మోసానికి గురయ్యాడా? అన్నకోణంలోనూ పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

# ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌లకు సస్పెన్షన్

**హైదరాబాద్,మన జనప్రగతి సెప్టెంబర్ 08:** తెలంగాణ రాజకీయాల్లో అసెంబ్లీ ఆవరణలో చోటు చేసుకున్న వివాదం మరో కీలక మలుపు తిరిగింది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై శాసనమండలి సస్పెన్షన్ వేటు వేసింది. ప్రస్తుత వర్షాకాల సమావేశాలు ముగిసే వరకు ఇద్దరినీ మండలి నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. ఇద్దరు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు శాసనమండలిలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఆ తర్వాత శాసనమండలి ఛైర్మన్ మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు. తీర్మానానికి ఆమోదం లభించిన తర్వాత తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిని ప్రస్తుత సెషన్ మొత్తానికి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత మండలి సమావేశాన్ని వాయిదా వేశారు. స్పీకర్‌పై ఎమ్మెల్సీలు చేసిన వ్యాఖ్యల వ్యవహారాన్ని శాసనసభ కూడా తీవ్రంగా పరిగణించింది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ తీర్మానం చేసింది. తెలంగాణ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ తీర్మానాన్ని శాసనసభలో ప్రవేశపెట్టారు. స్పీకర్ పదవికి గౌరవం తగ్గించేలా వ్యాఖ్యలు చేయడాన్ని శాసనసభ ఖండించింది. సభా మర్యాదలకు విరుద్ధంగా వ్యవహరించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. మహిళల ఎదుట అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణలను కూడా సభ ఖండించింది.

బీఆర్ఎస్ సభ్యుల ప్రవర్తనకు ఆ పార్టీ అధినేత కేసీఆర్ బాధ్యత వహించాలని, స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని తీర్మానంలో పేర్కొన్నారు. అసెంబ్లీ ఆమోదించిన తీర్మానాన్ని శాసనమండలి ఛైర్మన్‌కు పంపించారు. దీనిపై మండలిలో మంత్రి శ్రీధర్‌బాబు మరో తీర్మానం ప్రవేశపెట్టగా.. మూజువాణి ఓటింగ్ అనంతరం ఇద్దరు ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ నిర్ణయం వెలువడింది. అసెంబ్లీ ఆవరణలో జరిగిన ఘటనకు సంబంధించి తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మంగళవారం ఉదయం వారిని అదుపులోకి తీసుకుని విచారించిన తర్వాత కోర్టులో హాజరుపరిచారు. అయితే నాంపల్లి కోర్టు పోలీసుల రిమాండ్ అభ్యర్థనను తిరస్కరించింది. వ్యక్తిగత పూచీకత్తుతో విడుదల చేయాలని ఆదేశిస్తూ.. ఒక్కొక్కరు రూ.10 వేల పూచీకత్తుతో పాటు రెండు ష్యూరిటీలు సమర్పించాలని సూచించింది. కోర్టు ఆదేశాల మేరకు ష్యూరిటీలు సమర్పించిన తర్వాత ఇద్దరు ఎమ్మెల్సీలు విడుదలయ్యారు.

కోర్టు నుంచి విడుదలైన తర్వాత ఇద్దరు ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలు శాసనమండలికి హాజరయ్యారు. వారు సభలోకి రావడంపై అధికారపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తాతా మధు, నవీన్ రెడ్డిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. ఈ పరిణామాల మధ్యే సస్పెన్షన్ తీర్మానం మండలి ముందుకు వచ్చింది. తమ పార్టీ ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ వేటు వేయడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకించింది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలను నిబంధనలకు విరుద్ధంగా సస్పెండ్ చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మండలి ఆవరణలో ఆందోళన చేపట్టారు. సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ బైఠాయించారు. ప్రభుత్వం తమ పార్టీ నేతలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

# రిపబ్లికన్లకు అగ్నిపరీక్షే !

### అధికార పార్టీకి శాపంగా మారుతున్న ట్రంప్ నిర్ణయాలు

### మధ్యంతరంలో మెజారిటీ అసాధ్యమంటున్న పరిశీలకులు



**వాషింగ్టన్ :మన జనప్రగతి సెప్టెంబర్ 08:** అమెరికాలో మధ్యంతర ఎన్నికలకు మరో రెండు నెలలు మాత్రమే సమయం ఉండడంతో ప్రచార హోరు ఉధృతమవుతోంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యవహార శైలి, ఆయన అనుసరిస్తున్న విధానాలపై ప్రజలలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న తరుణంలో రిపబ్లికన్ల విజయావకాశాలు ప్రమాదంలో పడుతున్నాయి. కాంగ్రెస్‌లో ఇప్పటికే స్వల్ప ఆధిక్యతతో నెట్టుకొస్తున్న రిపబ్లికన్లకు ఈ ఎన్నికలు నిజంగా అగ్నిపరీక్షే. మధ్యంతర ఎన్నికలు అంటే దేశాధ్యక్షుడి పనితీరుపై ప్రజలు ఇచ్చే తీర్పు అని నిపుణుల అభిప్రాయం. ఒకవేళ ప్రతినిధులసభలో డెమొక్రాట్లకు మెజారిటీ లభిస్తే ట్రంప్ పాలనపై దర్యాప్తు చేపట్టే అవకాశం ఉంది. ట్రంప్ అవినీతిపై విచారణ జరుపుతామని ఆ పార్టీ నేతలు ఇప్పటికే ప్రకటించారు. డెమొక్రాట్లకు మెజరిటీ వస్తే ట్రంప్ ఒంటెత్తు పోకడలకు బ్రేక్ పడుతుంది. అనేక చట్టాల విషయంలో శ్వేతసౌధం రాజీపడాల్సి వస్తుంది.

**అనూహ్య ఫలితం తప్పదా ?** సెనెట్‌పై ఆధిపత్యం కోసం డెమొక్రాట్లు, రిపబ్లికన్ల మధ్య పోటీ తీవ్రంగా ఉంది. ఫలితం అనూహ్యంగా ఉండవచ్చునని చెబుతున్నారు. ఒకవేళ సెనెట్‌లో డెమొక్రాట్లకు మెజారిటీ వస్తే సుప్రీంలో ఖాళీ అయ్యే న్యాయమూర్తుల నియామకంతో పాటు ట్రంప్ నామినీలను చాలా వరకూ అడ్డుకునే అవకాశం ఉంది. రాయిటర్స్/ఇప్సోస్ తాజా సర్వే ప్రకారం ఇరాన్ యుద్ధం, ఆర్థిక వ్యవస్థ పనితీరుపై చాలా మంది తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. దీంతో ట్రంప్ రేటింగ్ అత్యంత కనిష్ట స్థాయికి పడిపోయింది. 2018లో డెమొక్రాట్లు ప్రతినిధులసభలో 40 సీట్లు గెలుచుకున్నారు. అప్పటితో పోలిస్తే ప్రస్తుతం ట్రంప్‌పై వ్యతిరేకత దాదాపు రెట్టింపైంది. రిపబ్లికన్లతో పోలిస్తే డెమొక్రాట్లు ఓటింగ్‌పై బాగా ఆసక్తి కనబరుస్తున్నారు. ఇటీవలి ప్రైమరీ ఎన్నికలలో ఈ విషయం స్పష్టమైంది. రిపబ్లికన్ అభ్యర్థులతో పోలిస్తే డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థులే ఐదు శాతం పాయింట్ల ఆధిక్యతలో ఉన్నారని చెబుతున్నారు.

**ఆ నాలుగు రాష్ట్రాలే కీలకం** 1938 నుంచి అమెరికాలో జరిగిన మధ్యంతర ఎన్నికలలో రెండు సందర్భాలలో తప్ప మిగిలిన అన్ని ఎన్నికలలోనూ అధ్యక్షుడి పార్టీ ప్రతినిధులసభలో తన బలాన్ని కోల్పోయింది. ప్రతినిధులసభలో ప్రస్తుతం రిపబ్లికన్లకు 218, డెమొక్రాట్లకు 214 మంది సభ్యులు ఉన్నారు. నవంబర్ 3వ తేదీన ప్రతినిధులసభలోని మొత్తం 435 స్థానాలకు, సెనెట్‌లోని వంద స్థానాలలో సుమారు మూడింట ఒక వంతు సీట్లకు ఎన్నికలు జరుగుతాయి. తీవ్రమైన పోటీ ఉన్న జార్జియా, మైనే, మిచిగాన్, నార్త్ కరోలినాలో డెమొక్రాట్లు మెజారిటీ సెనెట్ స్థానాలను గెలుచుకున్నప్పటికీ 2024 ఎన్నికలలో ట్రంప్‌కు మంచి మెజారిటీ ఇచ్చిన అలాస్కా, లోవా, ఒహియో, టెక్సాస్ రాష్ట్రాలలో వారు కనీసం రెండింటిని గెలుచుకోవాల్సి ఉంటుంది. డెమొక్రాట్లను సోషలిస్టులుగా, కమ్యూనిస్టులుగా రిపబ్లికన్లు చిత్రీకరిస్తున్న విషయం తెలిసిందే.

లోవాలో పెరుగు తున్న ఇంధన ధరలు, ట్రంప్ సుంకాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. అదే సమయంలో విదేశీ గొడ్డు మాంసంపై దిగుమతి పన్నును ఎత్తివే యాలన్న ట్రంప్ నిర్ణయంపై టెక్సాస్‌లోని పశువుల పెంపకందారులు మండిపడుతున్నారు. పొరుగు దేశమైన కెనడాతో జరుగుతున్న వాణిజ్య యుద్ధం మిచిగాన్, మైనే రాష్ట్రాలకు నష్టం కలిగించే అవకాశం ఉంది.

# అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

(మొదటి పేజీ తరువాయి)

తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వైసీపీ నేతలు, కార్యకర్తలు తమ నాయకుడు 'జగన్ మావిగన్' అంటే గుడ్డిగా సమర్థిస్తున్నారని, కానీ టీడీపీ అలా కాకుండా వాస్తవాలతో ప్రజల్లోకి వెళ్లాలని చెప్పారు. అమరావతిని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని, ఈ విషయాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

# సామాన్యులకు ఊరట కల్పించేలా చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

విక్రయాలు ప్రారంభమవుతాయని మంత్రి తెలిపారు.

ఉల్లితో పాటు, చౌకధరల దుకాణాల (రేషన్ డిపోలు) ద్వారా రాయితీపై కందిపప్పు, పామాయిల్ కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్ ధరలతో పోలిస్తే దాదాపు 30 శాతం తక్కువ ధరకే నాణ్యమైన సరుకులను ప్రజలకు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి సహకారం అందిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గుతుందని భావిస్తున్నారు.

# వైసీపీకి రాజీనామా చేసిన బొత్స మేనల్లుడు

**అమరావతి,మన జనప్రగతి సెప్టెంబర్ 08:**
వైసీపీలో కీలక పరిణామం చోటుచేసుకుంది. పార్టీ సీనియర్ నేత, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మేనల్లుడు, విజయనగరం జిల్లా వైసీపీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా లేఖను వైసీపీ అధినేత జగన్ కు పంపించారు. ఈ పరిణామం ఉత్తరాంధ్ర వైసీపీ శ్రేణులకు పెద్ద ఎదురుదెబ్బగా మారింది. మజ్జి శ్రీనివాసరావు తన రాజీనామా లేఖలో పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు, తాను నిర్వహిస్తున్న విజయనగరం జిల్లా అధ్యక్ష పదవి, భీమిలి నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జ్ బాధ్యతల నుంచి కూడా వైదొలగుతున్నట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆయన విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. బొత్స కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా, జిల్లాలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా వ్యవహరించే చిన్న శ్రీను అకస్మాత్తుగా ఈ నిర్ణయం తీసుకోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బొత్స సత్యనారాయణ కుటుంబానికి ఉత్తరాంధ్రలో గట్టి పట్టుంది. అలాంటి కీలక నేత మేనల్లుడే పార్టీని వీడటం వైసీపీకి తీవ్ర నష్టంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. జిల్లాలో కీలకమైన జడ్పీ ఛైర్మన్ పదవిలో ఉంటూ, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉన్న నేత రాజీనామా చేయడం వెనుక కారణాలపై పార్టీ వర్గాల్లో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. అయితే, తన రాజీనామాకు గల కారణాలను చిన్న శ్రీను ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. ఆయన భవిష్యత్ కార్యాచరణ ఏమిటనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# స్పీకర్‌ను పరామర్శించిన సిఎం రేవంత్..

**హైదరాబాద్: మన జనప్రగతి సెప్టెంబర్ 08:**అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఆయన ఛాంబర్‌లో మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు కలిసి పరామర్శించారు. సోమవారం అసెంబ్లీ ఎదుట జరిగిన పరిణామాల నేపథ్యంలో స్పీకర్‌ను సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కలు కలిశారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు స్పీకర్‌ను వ్యక్తిగతంగా దూషించటంతో స్పీకర్ గడ్డం ప్రసాద్ సోమవారం కంట తడి పెట్టుకున్న దృశ్యాలు చూసి ముఖ్యమంత్రి ఆవేదన చెందారు. మంగళవారం అసెంబ్లీకి రాగానే స్పీకర్ ఛాంబర్‌కు వెళ్లిన సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టిలు స్పీకర్‌ను పరామర్శించి, ఓదార్చారు. సోమవారం జరిగిన సంఘటనలపై వారిద్దరూ విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అండగా ఉంటుందని, బాధ్యులపై తప్పకుండా తగిన చర్యలు తీసుకుంటుందని స్పీకర్‌కు వారు హామీనిచ్చారు.

# శాఖలను సమూలంగా మార్చాలని అధిష్ఠానానికి చెప్పా...

**హైదరాబాద్,మన జనప్రగతి సెప్టెంబర్ 08:** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో కేబినెట్ విస్తరణ, మంత్రుల శాఖల మార్పుపై ఊహాగానాలు షికారు చేస్తున్న వేళ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. గాంధీ భవన్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం కేబినెట్‌లో ఉన్న మంత్రుల శాఖలన్నింటినీ సమూలంగా పునర్వ్యవస్థీకరించి, కొత్త శాఖలను కేటాయించాలని తాను కాంగ్రెస్ హైకమాండ్‌కు స్పష్టమైన సూచన చేసినట్లు వెల్లడించారు. పీసీసీ అధ్యక్షుడిగా తన పరిధి మేరకు పార్టీ ప్రయోజనాల కోసం ఈ సలహా ఇచ్చానని... దానిపై తుది నిర్ణయం తీసుకోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అధిష్ఠానం చేతిలోనే ఉందన్నారు. ఇక తనను మంత్రివర్గంలోకి తీసుకునే అంశంపై స్పందిస్తూ... ఆ విషయాలన్నీ అధిష్ఠానం నిర్ణయానికే వదిలేశానని తెలిపారు. ప్రస్తుతం పార్టీని బలోపేతం చేసే బాధ్యత కలిగిన పీసీసీ అధ్యక్షుడిగా నిరంతరం పనిచేస్తున్నానని పేర్కొన్నారు.

# చంద్రబాబు అపాయింట్‌మెంట్ కోరిన దస్తగిరి

**అమరావతి,మన జనప్రగతి సెప్టెంబర్ 08:** మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన షేక్ దస్తగిరి, ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసేందుకు మంగళవారం అమరావతికి చేరుకున్నాడు. గత ప్రభుత్వంలో తనను వేధించిన అధికారులే ఇప్పటికీ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఎంకు ఒక వినతిపత్రం సమర్పించేందుకు అమరావతి వచ్చినట్టు వెల్లడించాడు. తన భార్య షేక్ షబానాతో కలిసి వచ్చిన దస్తగిరి, సీఎం అపాయింట్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నట్లు మీడియాకు తెలిపాడు. ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ.. మాజీ సీఎం జగన్ పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించాడు. ఇప్పుడు జగన్ కు తాను నైతిక విలువలు చెప్పాల్సి వస్తోందని, జగన్ ఆ స్థాయికి దిగజారారని ఎద్దేవా చేశాడు. రాష్ట్రం గురించి మాట్లాడే ముందు, బాబాయి కూతురికి న్యాయం చేయాలని హితవు పలికాడు. తాను న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా నుంచి వకాల్తా తీసుకున్నట్లు నిరూపిస్తే జైలుకు వెళ్లడానికి సిద్ధమని, ఒకవేళ నిరూపించలేకపోతే జగన్ రాజకీయాల నుంచి తప్పుకుంటారా? అని సవాల్ విసిరాడు. వివేకా హత్య కేసులో జగన్, ఆయన భార్య భారతి విచారణ సంస్థలకు పూర్తిగా సహకరించాలని దస్తగిరి డిమాండ్ చేశాడు. అంతేకాకుండా, వివేకా హత్య కేసు, సంబంధిత మనీలాండరింగ్ వ్యవహారాలపై తన వద్ద ఉన్న కీలక వివరాలను ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేస్తానని దస్తగిరి స్పష్టం చేశాడు. "గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నన్ను చంపేస్తామని బెదిరించిన అధికారులే ఇప్పటికీ నా వెంటపడుతున్నారు. వారి వేధింపులు భరించలేకపోతున్నాం. అందుకే మా గోడును సీఎంతో చెప్పుకోవడానికి వచ్చాం" అని దస్తగిరి ఆవేదన వ్యక్తం చేశాడు. దస్తగిరి భార్య షబానా మాట్లాడుతూ, తాము పులివెందులకు వెళ్లాలంటేనే భయంగా ఉందని కన్నీటిపర్యంతమైంది. తమ కుటుంబం ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, న్యాయం పొందాలనే ఆశతో అమరావతికి వచ్చామని ఆమె తెలిపింది.

మనజనప్రగతి
09- 09 - 2026

# శ్రావణమాసంలో మారెమ్మతల్లి ఐదో వారం

## - అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు..భక్తులకు అన్నదానం




**పత్తికొండ మన జనప్రగతి సెప్టెంబర్ 08:**–కర్నూలు జిల్లా పత్తికొండ మండలం పుచ్చకాయలమడ గ్రామంలో వెలసిన పురాతన పుణ్యక్షేత్రం శ్రీ మారెమ్మతల్లి దేవాలయంలో శ్రావణమాసం ఐదో మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణమాసంలో ప్రతి మంగళవారం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.శ్రావణమాసంలో చివరి మంగళవారం కావడంతో మంగళవారం ఉదయం పంచామృత అభిషేకం, కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కర్ణపోస్ట్ ఆంజనేయ, ఈశ్వరప్ప, కాసిం తదితరులతో పాటు గ్రామస్తులు, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది.

# ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను ఆయా శాఖలు కచ్చితంగా సాధించాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి సెప్టెంబర్ 08:**–ఆయా శాఖలు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను కచ్చితంగా సాధించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ల కాన్ఫరెన్స్ సూచనల అమలు, కేంద్ర ప్రాయోజిత పథకాలపై సమీక్ష నిర్వహించారు.స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలకు స్పష్టమైన రోడ్‌మ్యాప్ రూపొందించి, శిక్షణలు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. పరిశ్రమలతో భాగస్వామ్యాన్ని బలోపేతం చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూగర్భ జలాల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ చెరువుల నింపకం, డీపెనింగ్, ఫ్లషింగ్, ఫామ్ పాండ్స్, పెర్కొలేషన్ ట్యాంకుల ద్వారా జల సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.సహజ వ్యవసాయం, తక్కువ నీటితో సాగు చేసే పంటలు, తక్కువ వ్యవధి పంటలు, సేంద్రీయ విత్తనాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పశుసంపదకు అవసరమైన పశుగ్రాసం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు.పరిశ్రమలకు అవసరమైన మౌలిక వసతులు, సింగిల్ విండో క్లియరెన్సులను వేగంగా పూర్తి చేయాలని, ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టులు, పర్యాటక ప్రాజెక్టులకు సంబంధించిన భూ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ రీసైక్లింగ్, పాఠశాలలు, హాస్టళ్ల నిర్మాణాలు, పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.'అన్నదాత సుఖీభవ' పథకంలో అర్హులైన రైతులందరికీ ప్రయోజనం అందేలా ఆధార్ సీడింగ్, భూముల పరిశీలన వేగవంతం చేయాలని, అంగన్‌వాడీలు, పోషణ్ ట్రాకర్, వక్ఫ్ భూముల పరిరక్షణపై చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అక్టోబర్‌లో జరగనున్న పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌ను దృష్టిలో ఉంచుకుని పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. సమీక్షలో చర్చించిన అంశాలపై 10 రోజుల్లో ఖచ్చితమైన చర్యల నివేదిక సమర్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ, సీపీఓ భారతి, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కూడేరు చెరువులకు హంద్రీ-నీవా నీరు విడుదల చేయాలి

## ● కరువు పరిస్థితులపై జిల్లా కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్ రెడ్డి వినతి



**ఉరవకొండ మన జనప్రగతి సెప్టెంబర్ 08:**–ఉరవకొండ నియోజకవర్గ పరిధిలోని కూడేరు మండలంలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని చెరువులను హంద్రీ–నీవా నీటితో తక్షణమే నింపాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్ రెడ్డి కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.కూడేరు మండలంలో సాధారణ వర్షపాతం తక్కువగా ఉండటంతో ఈ ఏడాది పరిస్థితులు మరింత దారుణంగా మారాయని విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం గణనీయంగా తగ్గిపోయిందని, సెప్టెంబర్ నెల వచ్చినా వర్షాలు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మెట్ట పంటలు ఎండిపోవడంతో పాటు పండ్ల తోటలను కాపాడుకునేందుకు రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకుంటున్నారని తెలిపారు.ఒక్కో నీటి ట్యాంకర్‌కు సుమారు రూ.600 వరకు ఖర్చు అవుతోందని, పంట చేతికొచ్చే వరకు ఈ భారాన్ని భరించడం రైతులకు సాధ్యం కాదన్నారు. బోర్లు అడుగంటిపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు, పశువులకు తాగునీటి సమస్య కూడా తీవ్రమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.హంద్రీ–నీవా రెండో దశ కాలువకు లైనింగ్ చేయడం వల్ల భూగర్భ జలాలు తగ్గిపోయాయని ఆయన పేర్కొన్నారు. శ్రీశైలం నుంచి నీరు వృథాగా దిగువకు వెళ్తున్నప్పటికీ కరువు ప్రాంతాలకు అవసరమైన నీటిని అందించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు. తుంగభద్రలో నీటి నిల్వలు ఉన్నందున ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా అనంతపురం జిల్లాకు అదనపు నీటిని మళ్లించే అవకాశం ఉందన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి హంద్రీ–నీవా నీటిని కూడేరు మండలంలోని చెరువులకు విడుదల చేసి రైతులు, ప్రజల ఇబ్బందులను తొలగించాలని వై.విశ్వేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.

# ఆశా కార్యకర్తల సేవలను మరింత బలోపేతం చేయాలి

## మాతా - శిశు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి: డీఎంహెచ్ఓ డా.యుగంధర్




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి సెప్టెంబర్ 08:**ఆశా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలకు, ముఖ్యంగా గర్భిణులు,బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా.యుగంధర్ పేర్కొన్నారు.మంగళవారం స్థానిక ఎన్‌జీఓ హోమ్ మీటింగ్ హాల్‌లో ఆశా డే, మాతాశిశు ఆరోగ్యం, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కల్లూరు, కామనూరు, రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు హాజరయ్యారు.ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డా.యుగంధర్ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు నిర్వహించాల్సిన విధులు, బాధ్యతలపై సమగ్రంగా అవగాహన కల్పించారు.ముఖ్యంగా హెచ్‌బీఎన్‌సీ (హోమ్ బేస్డ్ న్యూ బోర్న్ కేర్), హెచ్‌బీవైసీ (హోమ్ బేస్డ్ యంగ్ చైల్డ్ కేర్) కిట్లలోని వివిధ పరికరాలు, వస్తువుల వినియోగం, వాటి ద్వారా తల్లులు, శిశువులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. గర్భిణుల ఆరోగ్య పరీక్షలు, ప్రసవానికి ముందుతర్వాత అందించాల్సిన సేవలు, నవజాత శిశువుల సంరక్షణ,శిశువులకు అవసరమైన టీకాలు, పోషణ, తల్లిబిడ్డ ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాలపై సిబ్బందికి సూచనలు చేశారు. అదేవిధంగా జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు,నిర్దేశిత లక్ష్యాల సాధన,క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై సమీక్షించారు.గర్భిణులు,బాలింతలు, శిశువులకు ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సేవలు ప్రతి ఒక్కరికీ చేరేలా క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ప్రజలకు అందించే సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు.ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని, క్షేత్రస్థాయిలో సేకరించే సమాచారాన్ని సంబంధిత అధికారులకు సకాలంలో అందించాలని సూచించారు. ఆశా కార్యకర్తలు ప్రజలకు మరియు ఆరోగ్య శాఖకు మధ్య వారధిగా పనిచేస్తూ ఆరోగ్య సేవలను ప్రజల చెంతకు తీసుకెళ్లాలని అన్నారు. సమీక్ష సమావేశం ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును మరింత బలోపేతం చేయడంతో పాటు మాతాశిశు ఆరోగ్య సేవలను సమర్థవంతంగా అందించడం, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సాధించడం ప్రధాన ఉద్దేశమని డా.యుగంధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా.గీత, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.ప్రవీణ్ కుమార్,జిల్లా మలేరియా అధికారి డా.ఆరిఫ్,ప్రోగ్రాం ఆఫీసర్ డా.తాహా,వైద్యాధికారులు డా.హనీఫ్ బాబా,డా.సుమన్,డా.శ్రీనివాసులు,డా.నజీర్,డా.నాగార్జున,డా.భరత్ నారాయణ, డా.మురళీకృష్ణ, డా.మధు కుమార్,డా.మానస,డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# చాగలేరులో భారీ అగ్నిప్రమాదం..రూ.2.40 లక్షల నష్టం



## షార్ట్‌సర్క్యూట్‌తో కిరాణా దుకాణం,వ్యవసాయ గుడిసె దగ్ధం

## తొమ్మిది కుక్క పిల్లలు మృతి..బాధితుడికి ఆర్థిక సాయం చేయాలని విజ్ఞప్తి



**వేముల మన జనప్రగతి సెప్టెంబర్ 08:**–వేముల మండల పరిధిలోని స్థానిక చాగలేరు ఎస్సీ కాలనీలో మంగళవారం ఉదయం షార్ట్‌సర్క్యూట్ కారణంగా భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో చాగలేటి రవిశంకర్‌కు చెందిన కిరాణా దుకాణంతో పాటు వ్యవసాయ సామగ్రి నిల్వ చేసుకునేందుకు ఏర్పాటు చేసుకున్న గుడిసె పూర్తిగా దగ్ధమయ్యాయి.ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో దుకాణంలోని సరుకులు,గుడిసెలో నిల్వ ఉంచిన వ్యవసాయ సామగ్రి క్షణాల్లో కాలిపోయాయి. మంటలను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి వాటిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. అగ్నిమాపక సిబ్బందికి కూడా సమాచారం అందించారు. అయితే మంటలు వేగంగా వ్యాపించడంతో అప్పటికే దుకాణం, గుడిసెలోని సామగ్రి పూర్తిగా దగ్ధం అయిపోయాయి. గ్రామస్తులు మంటలను అదుపు చేసేందుకు చేసిన ప్రయత్నం నిరాశలు నిర్మించింది.**రూ.2.40 లక్షల మేర ఆస్తి నష్టం**బాధితుడు రవిశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉల్లి సాగు కోసం తెచ్చుకున్న యూరియా,సతవ మూటలు, బోరుకు సంబంధించిన స్టార్టర్ పెట్టెలు, పొలానికి నీరు అందించేందుకు ఉపయోగించే పీవీసీ పైపులు, కిరాణా దుకాణంలోని సరుకులు,చార్జింగ్‌కు పెట్టిన సుమారు రూ.40 వేల విలువైన వివో సెల్‌ఫోన్‌తో పాటు ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. వీటన్నింటి విలువ సుమారు రూ.2.40 లక్షలు ఉంటుందని, అగ్నిప్రమాదంతో తీవ్రంగా నష్టపోయానని రవిశంకర్ ఆవేదన వ్యక్తం చేశారు.**తొమ్మిది కుక్క పిల్లలు సజీవ దహనం**

అగ్నిప్రమాదంలో తొమ్మిది చిన్న కుక్క పిల్లలు సజీవ దహనం కావడం స్థానికులను కలచివేసింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో వాటిని కాపాడలేకపోయామని రవిశంకర్ కన్నీటి పర్యంతమయ్యారు. ఆస్తి నష్టంతో పాటు మూగజీవాలు మృతి చెందడం మరింత బాధాకరంగా ఉందన్నారు. అగ్నిప్రమాదంపై సంబంధిత అధికారులు స్పందించి నష్టాన్ని పూర్తిగా అంచనా వేయాలని బాధితుడు కోరారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని రవిశంకర్ విజ్ఞప్తి చేశారు.

# కొత్త పెన్షన్ దరఖాస్తుల స్వీకరణలో ఇబ్బందులు లేకుండా చూడాలి

## అర్హులైన ప్రతి ఒక్కరూ పెన్షన్‌కు దరఖాస్తు చేసుకోవాలి

## దరఖాస్తుల స్వీకరణను వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి సెప్టెంబర్ 08:**–పెన్షన్‌కు అర్హత ఉన్న ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులు స్వీకరించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి కొత్త పెన్షన్ దరఖాస్తులపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, డీఆర్‌డీఏ, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన ప్రక్రియను రోజువారీగా పర్యవేక్షించి నివేదిక అందజేయాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ పెన్షన్‌కు దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో డిజిటల్ సహాయకులు అందుబాటులో ఉండి దరఖాస్తుదారులకు మార్గదర్శకత్వం అందించాలని తెలిపారు. మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో అవసరమైన ఇంటి పన్ను పత్రాల జారీ ఆలస్యం కాకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు.ప్రజలు కార్యాలయాల వద్ద బారులు తీరకుండా అవసరమైన చోట అదనపు సిబ్బందిని, నాలుగు కంప్యూటర్లను ఏర్పాటు చేసి దరఖాస్తుల స్వీకరణను వేగవంతం చేయాలని సూచించారు. గడువు తక్కువగా ఉన్నందున వచ్చే వారం రోజులను అత్యంత ప్రాధాన్యతతో వినియోగించుకోవాలన్నారు. దరఖాస్తుదారుల అర్హతను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన ధ్రువపత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో ముందుగానే పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. చివరి నిమిషంలో ఇబ్బందులు తలెత్తకుండా వెరిఫికేషన్ పూర్తి చేసి, అర్హులైన వారి జాబితాను వెంటనే ప్రచురించాలని సూచించారు. అర్హత లేని వారికి పెన్షన్ మంజూరు చేయకూడదని స్పష్టం చేశారు.పెన్షన్‌కు అవసరమైన వైద్య ధ్రువపత్రాలను అదే రోజున జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని జీజీహెచ్ సూపరింటెండెంట్, డీసీహెచ్‌ఎస్‌లను ఆదేశించారు. ఆన్‌లైన్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తితే ముందుగా మాన్యువల్‌గా ధ్రువపత్రం జారీ చేసి, అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.దరఖాస్తుల స్వీకరణ, ధ్రువపత్రాల జారీ, సాంకేతిక సమస్యలకు సంబంధించి ఏ ఇబ్బంది ఎదురైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, జెడ్పీ సీఈఓ సుధాకర్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రావు, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారి భాస్కర్ నాయుడు, డీఎంహెచ్‌ఓ డా. కామేశ్వర ప్రసాద్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వర్లు, డీసీహెచ్‌ఎస్ డా. జఫ్రుల్లా, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నలు పకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబించాలి

## - వేంపల్లె వ్యవసాయ అధికారి బాల గంగాధర్ రెడ్డి

**వేంపల్లె మన జనప్రగతి సెప్టెంబర్ 08:**–మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు పకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని వేంపల్లి మండల వ్యవసాయ అధికారి ఎద్దుల బాలగంగాధర్ రెడ్డి పేర్కొన్నారు  పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం వేంపల్లె మండలం అల్లిరెడ్డిపల్లి, వేంపల్లి పరిసర గ్రామాల్లో ఆయన రైతులతో కలిసి పంట పొలాలను పరిశీలించారు.చౌడు భూముల్లో వరి పైరు ఎదుగుదల తగ్గడం, పిలకలు తగ్గడం, కొనలు ఎర్రబారడం వంటి సమస్యలు వస్తున్నందున ఎకరాకు 150–1000 కిలోల జిప్సం( చౌడు భూమిని బట్టి జిప్సం మోతాదు)వాడాలని ఆయన రైతులకు  సూచించారు.ప్రతి రైతు 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలని, పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. తక్కువ నీటితో ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని అనుకోరారు.కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది బి.మంజుల, వై.రెడ్డి వాణి, రైతులు,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



మనజనప్రగతి
తెలుగు దినపత్రిక
09- 09 - 2026

# దోమల నివారణకు ప్రజల భాగస్వామ్యం అవసరం



**బొమ్మనహల్ మన జనప్రగతి సెప్టెంబర్ 08:-**మండల పరిధిలో లింగదహాల్ గ్రామంలో పాఠశాల విద్యార్థులతో ఆరోగ్య అవగాహన ర్యాలీ నిర్వహించారు,వికసిత్ భారత్‌లో భాగంగా వ్యాధి రహిత సమాజ నిర్మాణానికి, ముఖ్యంగా దోమల రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని ఈ సందర్భంగా అవగాహన కల్పించారు,చిన్న జాగ్రత్త.. పెద్ద రోగాల నివారణ దోమలు పుట్టకూడదు.. కుట్టకూడదు,అనే నినాదాలతో ప్రజలకు పలు సూచనలు చేశారు,ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, వారానికి ఒకసారి నీటి నిల్వ పాత్రలను శుభ్రం చేసుకోవాలని, డ్రై డే పాటించాలని సూచించారు,పాత టైర్లు,కొబ్బరి చిప్పలు,ప్లాస్టిక్ వస్తువులు, రోళ్లలో నీరు నిల్వ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు,ముఖ్యంగా రాత్రి వేళల్లో దోమతెరలు వినియోగించాలని,ఇంటి కిటికీలకు వైర్‌మెష్ ఏర్పాటు చేసుకోవాలని,శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు ధరించాలని సూచించారు,ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉజనప్ప,హెల్త్ ఎడ్యుకేటర్ రుక్మిణి,ఎంఎల్‌హెచ్‌పీ అలివేలు, ఆరోగ్య కార్యకర్తలు వెంకటరమణ,ఎర్రమ్మ,ఆశా కార్యకర్తలు గంగమ్మ,మంజుల, పాఠశాల విద్యార్థులు,ప్రజలు పాల్గొన్నారు.

# కొత్త పెన్షన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పరిశీలన



**మదనపల్లి,మన జనప్రగతి సెప్టెంబర్ 08:-** ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద కొత్త పెన్షన్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు బసినికొండ1, కొండమర్రిపల్లి గ్రామ సచివాలయాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు, ప్రజలతో మాట్లాడి సమస్యలు, ఫిర్యాదులను తెలుసుకున్నారు. దరఖాస్తులను రిజిస్టర్‌లో క్రమబద్ధంగా నమోదు చేసి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. పథకం అమలులో పారదర్శకత పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌డబ్ల్యూ అమర్నాథ్ రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో తిరుపాల్ నాయక్, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరికి అక్షరాస్యత ఎంతో అవసరం

**- అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు.**



**ఎమ్మిగనూరు మన జనప్రగతి సెప్టెంబర్ 08:-**నేటి సమాజంలో ప్రతి ఒక్కరికి అక్షరాస్యత ఎంతో అవసరమని ప్రతి ఒక్కరూ చదవడం రాయడం, నేర్చుకోవాలని ఎమ్మిగనూరు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రసీదుల్లా అన్నారు. మంగళవారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం గువ్వలదొడ్డి గ్రామంలో అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో "జాగృతి పథకం 2025" లో భాగంగా అక్షరాస్యత యొక్క ఆవశ్యకతపై గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువు రాని వారికి చదవడం, రాయడం నేర్పించేలా కృషి చేయాలి అన్నారు. అక్షరాస్యత శాతం పెంచి గ్రామాల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ మల్లికార్జున ప్యానెల్ అడ్వకేట్ మురళీకృష్ణ, లింగమూర్తి, జగన్మోహన్, శ్రీ వీర రాఘవ, ఎమ్మిగనూరు ఏఎస్ఐ ప్రాణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లకు దరఖాస్తుల వెల్లువ

**- గ్రామ సచివాలయాల వద్ద అర్హులైన వారి బారులు.. ప్రభుత్వ నిర్ణయంపై హర్షం**



**సిద్ధవటం మన జనప్రగతి సెప్టెంబరు 08:-**రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానించడంతో మండలంలో పండుగ వాతావరణం నెలకొంది. మండలంలోని 18 గ్రామ సచివాలయాల వద్ద వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, చేనేత కార్మికులు తదితర అర్హులైన వారు పెద్ద సంఖ్యలో చేరుకుని పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. ప్రభుత్వం ప్రకటించిన గడువు మేరకు అర్హత కలిగిన వారు అవసరమైన ధ్రువపత్రాలతో సచివాలయాలకు చేరుకుని క్యూలైన్లలో ఓపిగ్గా వేచి దరఖాస్తులు సమర్పిస్తున్నారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను సచివాలయ సిబ్బంది పర్యవేక్షిస్తూ, అర్హులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వివరాలు నమోదు చేస్తున్నారు. పింఛన్ల ద్వారా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని పలువురు పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ అమలు చేస్తున్న పథకాలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వ నిర్ణయాన్ని కొనియాడుతున్నారు.

# పంటల నమోదు తప్పనిసరి



**సిద్ధవటం మన జనప్రగతి సెప్టెంబర్ 08:-**రైతులు సాగు చేస్తున్న ప్రతి పంటను తప్పనిసరిగా నమోదు చేయించుకుని ఫార్మర్ ఐడీ పొందాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రమేష్‌రెడ్డి సూచించారు. మంగళవారం టక్కోలు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన 'పొలం పిలుస్తుంది' కార్యక్రమంలో ఆయన రైతులకు అవగాహన కల్పించారు. పంటల నమోదు లేకపోతే రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందే అవకాశం ఉండదని తెలిపారు. రైతులందరి పంటల నమోదును పూర్తి చేయాలని రైతు సేవా కేంద్రం సిబ్బందికి సూచించారు. అనంతరం వరి పొలాలను పరిశీలించగా అక్కడక్కడ జింక్ లోపం గుర్తించినట్లు తెలిపారు. నివారణకు లీటర్ నీటికి 2 గ్రాముల చొప్పున చిలేటెడ్ జింక్‌ను కలిపి పంటపై పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రభాకర్‌రెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందాలి



**చిట్వేలి మన జనప్రగతి సెప్టెంబర్ 08:-**ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి వృద్ధాప్య, ఒంటరి మహిళ,దివ్యాంగులకు పెన్షన్లను అందించాలని రాజుగుంట మాజీ సర్పంచ్, తెలుగుదేశం పార్టీ యువ నాయకులు గుత్తి నరసింహ మండల అధికారులకు సూచించారు. చిట్వేలి మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది సహకరించి ప్రభుత్వం ఇచ్చిన గడువును ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ విషయమై మండల అభివృద్ధి అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండి త్వరతగతిన కొత్త పెన్షన్ల ఆన్లైన్ విధానాన్ని అనుసరించి పూర్తి చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎండిఓ అనిల్ కుమార్ , జనసేన నాయకులు మాదాసు నరసింహ, టిడిపి నాయకులు శివప్రసాద్ రాజు, నాయకులు పాల్గొన్నారు.

# రక్తదాన యోధుడిగా గాడి ఇంతియాజ్‌కు అవార్డు



**చిట్వేలి మన జనప్రగతి సెప్టెంబర్ 08:**"ఒక్క యూనిట్ రక్తం..ఒక ప్రాణానికి ఆశ."ఈ స్ఫూర్తితో నిరంతరం రక్తదాన సేవ చేస్తూ,ఎంతోమందికి ప్రాణదాతగా నిలుస్తున్న గాడి ఇంతియాజ్ సేవలకు అరుదైన గుర్తింపు లభించింది. ఖూన్ కా రిష్తా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో నిస్వార్థంగా రక్తదాన సేవలు అందిస్తున్న సేవామూర్తులను గుర్తించి అందించే "బ్లడ్ వారియర్2026" అవార్డుల ప్రదానోత్సవం కడపలోని రామిరెడ్డి మెమోరియల్ ఫార్మసీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ సినీ నటుడు శ్రీకాంత్, నిర్మాత రామకృష్ణ, దర్శకుడు సముద్రాల హాజరయ్యారు. ఈ సందర్భంగా చిట్వేలి మండల కేంద్రానికి చెందిన గాడి ఇంతియాజ్‌ను "బ్లడ్ వారియర్2026" అవార్డుకు ఎంపిక చేసి ఘనంగా సత్కరించారు. రక్తదానం చేయడమే కాకుండా ఇతరులను రక్తదానం చేసేందుకు ప్రేరేపించడం, గ్రామీణ ప్రాంతాల్లో రక్తదానంపై అవగాహన కల్పించడం, రక్తదాన శిబిరాల నిర్వహణకు సహకరించడం, శస్త్రచికిత్సలు, అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో రక్తాన్ని సమకూర్చడం, రక్తం కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలకు అండగా నిలవడం వంటి సేవలను నిరంతరం అందిస్తున్నందుకు ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత ఇంతియాజ్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచి, చేతనైనంత సహాయం చేయడమే నిజమైన మానవత్వం అని అన్నారు."ఈ అవార్డు నా ఒక్కరి విజయం కాదు. రక్తదానం చేస్తున్న ప్రతి రక్తదాతకు, రక్తదాన శిబిరాలకు సహకరిస్తున్న ప్రతి సేవామూర్తికి దక్కిన గౌరవం అన్నారు. చిట్వేలి హెల్ప్‌లైన్ సొసైటీ తరఫున సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండి పనిచేయడం మా బాధ్యతగా భావిస్తున్నామని, ముఖ్యంగా రక్తదాన సేవను మరింత విస్తృతం చేసి, అత్యవసర సమయంలో ఏ ఒక్కరూ రక్తం కోసం ఇబ్బంది పడకూడదన్నదే మా లక్ష్యం, రక్త కొరత లేని సమాజ నిర్మాణమే మా ధ్యేయం అన్నారు. చిట్వేలి మండలంలో రక్తదాన శిబిరాలను ప్రోత్సహిస్తున్న సేవామూర్తులకు, రక్తదాతలకు ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలిపారు. తన సేవలను గుర్తించి "బ్లడ్ వారియర్ 2026" అవార్డుతో సత్కరించిన ఖూన్ కా రిష్తా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు తారిఖ్ మహమ్మద్, రామిరెడ్డి మెమోరియల్ ఫార్మసీ కళాశాల కరస్పాండెంట్ గౌతమ్ కుమార్ రెడ్డి లకు ఇంతియాజ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రశాంత ఎన్నికలకు ప్రజలు సహకరించాలి

- **నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి: ఎస్ఐ హారిక**



**సిద్ధవటం మన జనప్రగతి సెప్టెంబరు 08:-**రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు పోలీసులకు సహకరించాలని సిద్ధవటం ఎస్ఐ హారిక కోరారు. మంగళవారం సిద్ధవటం పోలీస్‌స్టేషన్‌లో ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో చిన్నపాటి వివాదాలు సైతం పెద్ద సమస్యలకు దారితీయకుండా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని కోరారు. గ్రామాల్లో గొడవలు, ఘర్షణలకు తావులేకుండా పరస్పర సహకారంతో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పాలని తెలిపారు. అదేవిధంగా మహిళలపై జరిగే నేరాల నియంత్రణ, మహిళల భద్రత, వేధింపుల నివారణ, చట్టపరమైన రక్షణ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఎస్ఐ హారిక పేర్కొన్నారు. ఎక్కడైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితులు ఎదురైతే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామాల్లో శాంతిభద్రతలను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి పోలీసులకు సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# రీసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం



**సిద్ధవటం మన జనప్రగతి సెప్టెంబర్ 08:-**రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని సిద్ధవటం తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని మూలపల్లి గ్రామంలో మంగళవారం 4వ విడత రీసర్వేపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బ్రిటిష్ పాలనలో 1905లో సర్వే జరిగిందని,అనంతరం సమగ్ర సర్వేలు లేకపోవడంతో భూ సమస్యలు పెరిగాయన్నారు.భూమి విస్తీర్ణంపై స్పష్టత లేకుండానే గతంలో రిజిస్ట్రేషన్లు జరగడం వల్ల అనేక వివాదాలు తలెత్తాయన్నారు. సుమారు 120 ఏళ్ల తర్వాత భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రీసర్వే చేపట్టిందని తెలిపారు. మూలపల్లి గ్రామం 4వ విడత రీసర్వేకు ఎంపికైందని, అక్టోబర్ నుంచి సర్వే ప్రారంభమవుతుందని చెప్పారు. రీసర్వే పూర్తయిన అనంతరం భూములకు సంబంధించిన సమగ్ర వివరాలతో బార్‌కోడ్ కలిగిన పట్టాదారు పాస్‌పుస్తకాలు అందజేస్తామని, తద్వారా రైతుల భూ సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ కన్వీనర్ మామిడి సుబ్బారెడ్డి, మండల సర్వేయర్ జ్యోషిరాజు, వీఆర్వో గౌస్‌బాషా, వీఆర్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

# కేఓఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో కృత్రిమ మేధస్సుతో ఆధునిక రోబోటిక్స్‌పై ప్రాయోగిక శిక్షణ

- **రోబోటిక్స్,స్వయంచాలకీకరణపై విద్యార్థులకు అవగాహన**
- **రోబో పనితీరును ప్రత్యక్షంగా ప్రదర్శించిన నిపుణులు**



**కడప మన జనప్రగతి సెప్టెంబర్ 08:-**కేఓఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో రెషాప్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సహకారంతో కృత్రిమ మేధస్సుతో కూడిన ఆధునిక రోబోటిక్స్‌పై ప్రాయోగిక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోబోటిక్స్, కృత్రిమ మేధస్సు, స్వయంచాలకీకరణతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.రెషాప్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకులు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి దేవ నాగేంద్ర మదినేని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. ప్రస్తుత సాంకేతిక యుగంలో రోబోటిక్స్, కృత్రిమ మేధస్సుకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బుర్రి ప్రసాద్ వనరుల వ్యక్తిగా పాల్గొని రోబోటిక్స్‌కు సంబంధించిన సాంకేతిక అంశాలను వివరించారు. కార్యక్రమంలో రోబోను విద్యార్థులకు పరిచయం చేసి, దాని పనితీరును ప్రత్యక్షంగా ప్రదర్శించారు. రోబో లక్షణాలు, పని విధానం, వివిధ రంగాల్లో దాని వినియోగాలను వివరించడంతో పాటు విద్యార్థులతో ప్రత్యేక పరస్పర చర్చ నిర్వహించారు. ఇంజినీరింగ్, డిప్లొమా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.కరస్పాండెంట్ ఎస్. లిఖితా రెడ్డి మాట్లాడుతూ.. ఇటువంటి ప్రాయోగిక శిక్షణా కార్యక్రమాల ద్వారా విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ప్రాయోగిక జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సిద్ధేశ్వరరావు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ప్రాధాన్యతను వివరించారు. కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగాధిపతి హెచ్. మధుసూదనరావు రోబోటిక్స్, కృత్రిమ మేధస్సు రంగాల్లో పెరుగుతున్న అవకాశాలను వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమం విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు, నూతన ఆవిష్కరణలపై ఆసక్తిని పెంపొందించిందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో విభాగాధిపతులు, బోధనా, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల నమోదు పారదర్శకంగా జరగాలి: కమిషనర్ ఎం.ఎస్.తనూజ

**- స్వర్ణ వార్డు కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్**





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి సెప్టెంబర్ 08:**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు పులివెందుల పురపాలక సంఘం పరిధిలోని అన్ని స్వర్ణ వార్డు కార్యాలయాల్లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పురపాలక సంఘ కమిషనర్ ఎం. ఎస్. తనూజ పలు వార్డు సచివాలయాలను ఆకస్మికంగా సందర్శించి,పెన్షన్ల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన అర్జీదారులతో నేరుగా మాట్లాడి,వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్వర్ణ వార్డు సిబ్బందితో సమీక్ష నిర్వహించి,ఆన్‌లైన్ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను అరా తీశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ తప్పకుండా పెన్షన్ ఆన్‌లైన్ నమోదు అయ్యేల చూడాలని,ఎక్కడా ఎటువంటి పొరబాట్లకు తావులేకుండా ఈ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు,సిబ్బందికి కమిషనర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
09- 09 - 2026

# రైల్వేకోడూరులో వృద్ధురాలు అనుమానాస్పద మృతి

● వినాయక నగర్‌లో తీవ్ర విషాదం.. ● హత్యా..?ప్రమాదమా..? పోలీసుల దర్యాప్తు



**రైల్వే కోడూరు మన జనప్రగతి సెప్టెంబర్ 08:**-రైల్వేకోడూరు పట్టణంలోని వినాయక నగర్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. రాజుపాలెం మంగమ్మ అనే 70 ఏళ్ల వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది.కడప జిల్లా పులివెందులకు చెందిన మంగమ్మ తన భర్త కృష్ణ మృతి అనంతరం సుమారు 30 ఏళ్ల క్రితం ఉపాధి కోసం రైల్వేకోడూరుకు వచ్చారు. అప్పటి నుంచి వినాయక నగర్‌లోనే నివాసముంటూ జీవనం సాగిస్తున్నారు.అయితే గత రాత్రి ఆమె నివాసానికి సమీపంలోని పక్క సందులో తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు.మృతురాలి శరీరంపై గాయాలు ఉండటంతో పాటు, ఆమె వద్ద ఉన్నట్లు చెబుతున్న నగలు కనిపించకపోవడంతో స్థానికుల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మంగమ్మ మృతి హత్యా? ప్రమాదవశాత్తు జరిగిందా? లేక మరేదైనా కారణమా? అనే కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నామని రేణిగుంట డిఎస్పి వై శ్రీనివాసులు మీడియాకు తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తు అనంతరం వెల్లడికానున్నాయి. సంఘటన స్థలంలో డ్రోన్ కెమెరాల తో సర్వే నిర్వహించి క్లూస్ టీం ద్వారా చర్యలు చేపట్టారు . డాగ్ స్క్వాడ్ జాకిలంతో కూడా సోదాలు నిర్వహించారు.వృద్ధురాలి అనుమానాస్పద మృతితో వినాయక నగర్‌లో విషాదఛాయలు అలుముకోవడంతో పాటు స్థానికుల్లో ఆందోళన నెలకొంది.

# దళితుల భూ సమస్యలు పరిష్కరించండి..!

**- ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు,సాకే హరి**



**బొమ్మనహాల్ మన జనప్రగతి సెప్టెంబర్ 08:**-దళితుల భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి తెలిపారు,మంగళవారం బొమ్మనహాళ్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో దళితులవి వివిధ గ్రామంలో భూ సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని సాకే హరి విలేకరుల సమావేశంలో మాట్లాడారు,వ్యవసాయ భూముల ఇల్లు స్థలాలు స్మశాన వాటికల సమస్యలు పరిష్కరించాలని ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న పరిష్కరించకపోవడం చాలా అన్యాయమన్నారు,శ్రీధర్ గట్ట గ్రామంలో దళితులైన ఓన్నూరు స్వామి,ఉలిగేష్ ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుని జీవిస్తున్న భూములను కొంతమంది భూ కబ్జా జదారులు దౌర్జన్యంగా ఆక్రమించుకోవాలని అడ్డు తగులుతున్నారన్నారు,బాధిత దళితులు రెవెన్యూ పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరిన ఫలితం లేకుండా పోయిందన్నారు,పలు గ్రామాల్లో దళితులకు స్మశాన వాటికలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు,కొన్నిచోట్ల దళితుల స్మశాన వాటికలను కబ్జా చేస్తున్నారని ఆవేదన చెందారు,రెవెన్యూ అధికారులు మారుతున్నారు తప్ప భూ సమస్యలు పరిష్కరించలేక పోతున్నారని ఇప్పటికైనా స్పందించాలన్నారు,గ్రామీణ ప్రాంతాల్లో కులవ్యక్షత గురిచేస్తూ దళితులను వేధింపులు గురి చేయడం మానుకోవాలన్నారు, లేదంటే భూ బాధితులను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు,ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు పవన్,కురాకులపల్లి గోపాల్,రామాంజనేయులు,వన్నూరుస్వామి,అంకె హరి, ప్రవీణ్,చౌడన్న,మహేష్, నాగరాజు,ప్రసాద్,మురళి తదితరలు పాల్గొన్నారు.

# డీజేలు వద్దు.. ఆర్కెస్ట్రాలు వద్దు.. ప్రశాంత నిమజ్జనమే ముద్దు..!

● ఆర్కే వ్యాలీ సీఐ శంకర్ రెడ్డి

● నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

● ప్రజలు,ఉత్సవ కమిటీలు పోలీసులకు సహకరించాలన్న సీఐ



**పులివెందుల స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి సెప్టెంబర్ 08:**-వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో,ప్రశాంత వాతావరణంలో నిర్వహించి, నిమజ్జన కార్యక్రమాన్ని ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సజావుగా పూర్తి చేయాలని ఆర్కే వ్యాలీ సీఐ సి. శంకర్ రెడ్డి ప్రజలకు, ఉత్సవ కమిటీ నిర్వాహకులకు సూచించారు. కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు వేముల, చక్రాయపేట మండలాల్లో నిమజ్జనం సందర్భంగా ప్రత్యేక నిబంధనలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.**డీజేలు,ఆర్కెస్ట్రాలకు అనుమతి లేదు** నిమజ్జనం రోజున డీజేలు, ఆర్కెస్ట్రాలకు ఎలాంటి అనుమతి ఉండదని సీఐ స్పష్టం చేశారు. పండుగ సందర్భంగా గొడవలు, ఘర్షణలు, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ సంయమనంతో వ్యవహరించాలని కోరారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.**విద్యుత్ భద్రతపై జాగ్రత్తలు**వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో విద్యుత్ తీగలను నిర్లక్ష్యంగా ఏర్పాటు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ సూచించారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌కు అవకాశం లేకుండా తీగలను సురక్షితంగా ఏర్పాటు చేసుకోవాలని, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.నిమజ్జన ఊరేగింపులో ట్రాక్టర్లు, లారీలు, ఆటోలు తదితర వాహనాలను నడిపే డ్రైవర్లు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. వాహనాలను జాగ్రత్తగా నడుపుతూ వేగ నియంత్రణ పాటించాలని, ప్రమాదాలకు ఎలాంటి అవకాశం లేకుండా చూడాలని తెలిపారు.**సీసీ కెమెరాలతో భద్రత..**వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసిన నిర్వాహకులు భద్రతా చర్యల్లో భాగంగా విగ్రహాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సీఐ సూచించారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు నిర్వాహకులు, వాలంటీర్లు అక్కడే ఉండి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించాలని తెలిపారు.వేముల, చక్రాయపేట మండలాల ప్రజలు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసు శాఖకు పూర్తిగా సహకరించి సోదరభావంతో పండుగను నిర్వహించాలని సీఐ సి. శంకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ పోలీసుల సూచనలు, నిబంధనలు పాటించి వినాయక చవితి వేడుకలను ఆనందంగా, ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు.

# జేఎన్‌టీయూ పులివెందులలో ఘనంగా ‘ఆశ్రయ్ 2కే26’ పోస్టర్ ఆవిష్కరణ

● అక్టోబర్ 12 నుంచి మూడు రోజుల పాటు జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి సెప్టెంబర్ 08:** స్థానిక జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలోని సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో అక్టోబర్ 12,13, 14 తేదీల్లో జాతీయ స్థాయి విద్యార్థి సాంకేతిక సదస్సు, వర్క్‌షాప్ “ఆశ్రయ్ 2కే26“ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన అధికారిక వాల్ పోస్టర్, బ్రోచర్‌ను మంగళవారం కళాశాలలో ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.విష్ణువర్ధన్ మాట్లాడుతూ ‘ఆశ్రయ్ 2 కే 26‘ వంటి సదస్సులు విద్యార్థుల భవిష్యత్తు కెరీర్‌కు ఎంతో దోహదపడతాయన్నారు. విద్యార్థులు కేవలం పాఠ్యప్రణాళికకే పరిమితం కాకుండా అదనపు జ్ఞానం, నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఇటువంటి వేదికలు చక్కటి అవకాశమని పేర్కొన్నారు.అనంతరం ప్రొఫెసర్ ఎ.దామోదర రెడ్డి మాట్లాడుతూ ఈ సదస్సు వివిధ కళాశాలల నుంచి వచ్చే విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.ప్రత్యేకంగా నిర్వహించే స్ట్రక్చరల్ డిజైన్ వర్క్‌షాప్,ఫీల్డ్ ఎక్స్‌పో వంటి కార్యక్రమాలు ఆచరణాత్మక (ప్రాక్టికల్) పరిజ్ఞానాన్ని పెంచుతాయని తెలిపారు.కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.శివనాథ్ రెడ్డి మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సు మొదటి రోజు ప్రారంభ వేడుకతో పాటు ప్రత్యేక స్మరణిక (సావనీర్) ఆవిష్కరణ ఉంటుందన్నారు.అనంతరం స్ట్రక్చరల్ డిజైన్ వర్క్‌షాప్,పీపీటీ ప్రజెంటేషన్లు,వర్కింగ్ మోడల్స్ ప్రదర్శన,స్పాట్ ఈవెంట్స్,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# జనసేనలో ఎన్నికల సందడి.. అభ్యర్థుల వేటకు శ్రీకారం

● మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వివరాల సేకరణ

● బలమైన అభ్యర్థుల గుర్తింపుపై నాయకులతో దాసరి రవిశంకర్ చర్చ



**పులివెందుల స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి సెప్టెంబర్ 08:**-జనసేన పార్టీలో మున్సిపల్ ఎన్నికల సందడి ప్రారంభమైంది. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీ చేయనున్న అభ్యర్థుల ఎంపికపై జనసేన నాయకత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా పులివెందుల పట్టణంలోని జనసేన గ్యారేజ్‌లో స్థానిక ఎన్నికల కోఆర్డినేటర్, జనసేన పార్టీ కడప పార్లమెంట్ సహాయ బృందం సభ్యుడు దాసరి రవిశంకర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీ చేయనున్న అభ్యర్థుల వివరాలపై నాయకులతో చర్చించారు. ఆయా వార్డుల్లో పార్టీ తరఫున పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల వివరాలను సేకరించినట్లు దాసరి రవిశంకర్ తెలిపారు. ప్రతి వార్డులో పార్టీకి బలమైన అభ్యర్థులను గుర్తించి, వారితో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల కార్యాచరణ రూపొందించనున్నట్లు పేర్కొన్నారు.మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, పట్టణంలోని సమస్యలను తెలుసుకుని ప్రజలతో మమేకమై పనిచేయాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తే జనసేన పార్టీని మరింత బలోపేతం చేయవచ్చని అన్నారు.రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని దాసరి రవిశంకర్ పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు చురుగ్గా వ్యవహరించాలని సూచించారు.ఈ సమావేశంలో జనసేన పార్టీ నాయకులు జగదీష్, భరత్‌రెడ్డి, ఉమర్, ప్రసాద్, బాబావల్లి, హితేష్, ఫరూక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


# నైతిక విలువలతో మెలగండి

**- విద్యార్థులకు ‘మానవత’ పిలుపు**



**సింహాద్రిపురం మన జనప్రగతి సెప్టెంబర్ 08:** విద్యార్థులు క్రమశిక్షణ,నైతిక విలువలతో మెలగాలని పులివెందుల ‘మానవత’ స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ డి.వి.కొండారెడ్డి పిలుపునిచ్చారు.సోమవారం మండల పరిధిలోని గురజాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన “మానవీయ విలువలు“ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా డి.వి.కొండారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సత్ప్రవర్తన,మానవతా దృక్పథం అలవర్చుకోవాలని సూచించారు.కన్వీనర్ బి.వి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ సమాజంలో తల్లిదండ్రులు,గురువులకు ఉన్నత స్థానం ఉందని,వారిని గౌరవిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పేర్కొన్నారు.ఉత్తమ పౌరులుగా ఎదగడానికి క్రమశిక్షణే కీలకమని సంస్థ అధ్యక్షులు చవ్వా కృష్ణారెడ్డి వివరించారు.‘మానవత’ సంస్థ ఆశయాలు,జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న సేవా కార్యక్రమాలను జిల్లా కార్యవర్గ సభ్యులు జి.చంద్రశేఖర్ రెడ్డి సభకు వివరించగా సంస్థ సేవలను హెచ్ఎం చంద్రశేఖర్ రెడ్డి కొనియాడారు.**విజేతలకు బహుమతుల ప్రదానం** ‘విద్యార్థులు - నైతిక విలువలు’ అంశంపై నిర్వహించిన ప్రతిభా పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.ప్రథమ స్థానం సి.ప్రణతి,ద్వితీయ స్థానం సి.శ్రావ్య,తృతీయ స్థానం ఎస్.రేష్మవిజేతలకు ఫైళ్లు,మెమొంటోలను అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో మానవత ప్రతినిధి సోమశేఖర్ రెడ్డి,పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి సెప్టెంబర్ 08:**పులివెందుల పట్టణ పరిధిలోని కోతి సమాధి వద్ద గల అభయాంజనేయ స్వామి దేవస్థానము నందు శ్రావణ మాస సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవిత్రమైన శ్రావణమాసాన్ని పురస్కరించుకుని పులివెందుల గ్రామ సరిహద్దులో గల అభయాంజనేయ స్వామి ఆలయం నందు స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకుల అభిషేకాలు ఆకు పూజలు అనంతరం ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయ స్వామి భక్తులకు దర్శనం ఇవ్వగా మహా మంగళహారతి తో ప్రజలు స్వామివారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమాలలో భాగంగానే ఆలయ ప్రాంగణంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు.శుభకరమైన శ్రావణమాసం నందు నిర్వహించే పూజాధికాలతో పాటు అన్నదాన కార్యక్రమాలకు అత్యధిక ప్రాముఖ్యత కలదని ఆలయ అర్చకులు తెలియజేస్తూ ఈ రకమైనటువంటి కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందించిన ఉభయదారులందరికీ అభయాంజనేయ స్వామి ఆశీస్సులు మెండుగా ఉండాలని వారు ఆకాంక్షించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు మరియు భక్తజనం తదితరులు పాల్గొన్నారు.

# పింఛన్లకు దరఖాస్తుల ఆహ్వానం: కమిషనర్ ఎం.జయకృష్ణ.




**తిరుపతి మన జనప్రగతి సెప్టెంబర్ 08:**- ఆర్ భరోసా పింఛన్ల కోసం అర్హు లైన వారి నుంచి ఈ నెల 16వ తేదీ వరకు దరఖాస్తులు స్వీక రించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. జయకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత స్వర్ణ వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, చేనేత కార్మికులు, మత్స్యకారులు, డప్పు కళాకారులు, సంప్రదా య చెప్పుల తయారీదారులు, కల్లుగీత కార్మికులు, ట్రాన్జెండర్లు తదితర అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చనని తెలిపారు. ఆధార్, రేషన్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రంతో పాటు సంబంధిత కేటగిరీ ధ్రువపత్రాలు సమర్పించా లని తెలిపారు. దరఖాస్తులను సచివాలయ సిబ్బంది ఆన్ లైన్లో నమోదు చేసి రసీదు అందజేస్తారని తెలిపారు. అనంతరం అర్హతపై క్షేత్రస్థాయి పరిశీలన ఉంటుందని చెప్పారు. అర్హులైన వారు గడువులోపు దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని కమిషనర్ ఎం.జయకృష్ణ ఆ ప్రకటనలో కోరారు.

# సేవా దృక్పథంతో డాక్టర్ చైతన్య రెడ్డి బర్త్‌డే వేడుకలు

**- అంధులకు పండ్లు,బ్రెడ్ల పంపిణీ**

**- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన నేతలు**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి సెప్టెంబర్ 08:**-వైద్యులు డాక్టర్ దేవిరెడ్డి చైతన్య రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం పులివెందుల పట్టణంలోని క్రిస్టియన్ లైన్‌లో ఉన్న సమస్త ఆశ్రమంలో సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సోషల్ మీడియా ప్రతినిధి కొంగనపల్లి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర బీసీ విభాగ ఉపాధ్యక్షుడు వల్లెపు వరప్రసాద్,పట్టణ ఉపాధ్యక్షుడు హాల్ గంగాధర్,కొంగనపల్లి మురళి హాజరయ్యారు. ఆశ్రమవాసులైన అంధుల సమక్షంలో కేక్ కట్ చేయించి,వారికి పండ్లు, బ్రెడ్లు,బిస్కెట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వల్లెపు వరప్రసాద్ మాట్లాడుతూ దేవిరెడ్డి శంకర్ రెడ్డి తనయుడైన డాక్టర్ చైతన్య రెడ్డి నిరంతరం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ మన్ననలు పొందుతున్నారని కొనియాడారు.ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఆలస్యం లేకుండా తక్షణ వైద్య సేవలు అందించడంలో ఆయన విశేష కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఆయన నిండు నూరేళ్లూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని,భగవంతుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో దేని,తోటం శెట్టి హరి కృష్ణ, ప్రశాంత్,మేకల గంగాధర్, ఆశ్రమ నిర్వాహకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా..పర్యావరణహితంగా

## వినాయక చవితి ఉత్సవాలు

- సెప్టెంబర్ 12లోపు మండపాలకు అనుమతులు తప్పనిసరి
- మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి సెప్టెంబర్ 08:**-వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ సూచించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో ఉత్సవాల నిర్వహణపై అధికారులు, ఉత్సవ కమిటీల ప్రతినిధులతో చర్చించారు.ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలు, విద్యుత్ భద్రత, వైద్య సేవలు, ట్రాఫిక్ నియంత్రణ, అగ్నిమాపక చర్యలు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మండపాల ఏర్పాటుకు సెప్టెంబర్ 12వ తేదీలోపు తప్పనిసరిగా అనుమతులు పొందాలని, అనుమతులు లేకుండా మండపాలు ఏర్పాటు చేయవద్దని నిర్వాహకులకు తెలిపారు.పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను వినియోగించకుండా మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలని కోరారు. ప్రతి మండపం వద్ద ప్రత్యేక పర్యవేక్షణతో పాటు నిరంతర పారిశుధ్య నిర్వహణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఉత్సవాలు సోదరభావం, సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు, ఉత్సవ కమిటీలు అధికారులకు సహకరించాలని కోరారు. పోలీసు, రెవెన్యూ, విద్యుత్, ఆర్అండ్బీ, అగ్నిమాపక, వైద్య శాఖల అధికారులు, వివిధ ధార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సంపూర్ణ అక్షరాసతతోనే సమాజాభివృద్ధి సాధ్యం: ప్రిన్సిపల్ ఉషశ్రీ




**వేంపల్లె మన జనప్రగతి సెప్టెంబర్ 08:**-సంపూర్ణ అక్షరాస్యతతోనే సమాజాభివృద్ధి సాధ్యమని వేంపల్లి వైయస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే.ఉషశ్రీ పేర్కొన్నారు. స్థానిక గరుగువీధిలోని డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్షరాస్యత ప్రతి ఒక్కరి హక్కు అని,వందశాతం అక్షరాస్యతతోనే సమాజ అభివృద్ధి సాధ్యమన్నారు.చదువు వల్లే వ్యక్తిగత అభివృద్ధి, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు అక్షరాస్యత ఆవశ్యకతపై ప్రసంగించారు. నిరక్షరాస్యత నిర్మూలనకు ప్రతి విద్యార్థి కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ షాజియా బేగం,ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ జనార్ధన,కుమార్ రాజా,అధ్యాపకులు హరిత,మసూద్,పీడీ తేజేంద్ర,స్వర్ణ లత,అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## పెన్నహోబిలం,ఆమిద్యాలలో వైభవంగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఉట్ల మహోత్సవం





**ఉరవకొండ మన జనప్రగతి సెప్టెంబర్ 08:**-ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెన్నహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంతో పాటు ఆమిద్యాల గ్రామంలో ఉట్ల మహోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థాన ధర్మకర్తల మండలి ఛైర్మన్ రేగటి నాగరాజు, కార్యనిర్వహణాధికారి సి. రమేష్ బాబు, పాలకమండలి సభ్యులు తెలిపారు.సెప్టెంబర్ 8న ఉదయం 9 గంటలకు ఆమిద్యాల గ్రామం నుంచి శ్రీ స్వామివారి ఉత్సవ విగ్రహాలు పెన్నహోబిలం దేవస్థానానికి చేరుకున్నాయి. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు దేవస్థాన ప్రాంగణంలో ఉట్ల మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవం అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలు తిరిగి ఆమిద్యాల గ్రామానికి బయలుదేరనున్నాయి.అలాగే సెప్టెంబర్ 9న ఆమిద్యాల గ్రామంలో సాయంత్రం 4 గంటలకు ఉట్ల మహోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థాన పాలకమండలి, అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈఓ రమేష్ బాబు తెలిపారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి దివ్య ఆశీస్సులు పొందాలని ఛైర్మన్ రేగటి నాగరాజు, ఈఓ రమేష్ బాబు కోరారు.

## అక్రమంగా అరెస్ట్ చేసిన 'ఐ న్యూస్' జర్నలిస్టులను బేషరతుగా విడుదల చేయాలి: ఏపిజెఎఫ్ డిమాండ్




**కాకినాడ మన జనప్రగతి సెప్టెంబర్ 08:**-రాష్ట్ర మంత్రి ఫరూఖ్ కుమారులపై ఐ న్యూస్ చానల్లో కథనం ప్రసారం చేసిన నంద్యాల రిపోర్టర్స్ ను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని కాకినాడ జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు, ఎపిజెఎఫ్ నాయకులు వీధి సాయినాథ్, రెడ్డిపల్లి రాజేశ్ తీవ్రంగా ఖండించారు. నంద్యాలలో జరుగుతున్న విషయాలను వెలుగులోకి తీసుకువస్తు ఐ న్యూస్ రిపోర్టర్స్ ప్రసారం చేసిన అంశాలలో అభ్యంతరాలు ఉంటే ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసన తెలియజేయవచ్చని అయితే అందుకు విరుద్ధంగా జర్నలిస్టులపై దాడులకు బెదిరింపులకు తెగబడటం దారుణమన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉండే మీడియా వ్యవస్థ లోని లోపాలను వెలుగులోకి తీసుకువచ్చినప్పుడు సరైన రీతిలో స్పందించక పోగా ఇటువంటి చర్యలకు పాల్పడటాన్నీ తప్పుపట్టారు.నచ్చని వార్తలపై ఖండన ఇవ్వొచ్చని, ఆధారాలు లేకుంటే పరువునష్టం దావా కూడా వేయొచ్చనీ అన్నారు. అలా కాకుండా అధికార పార్టీ నేతల అండతోనే వార్తలు ప్రసారం చేసిన జర్నలిస్టులుపై అన్యాయంగా కేసులు పెట్టి అర్ధరాత్రి అదుపులోకి తీసుకొని ఇప్పటి వరకు అరెస్ట్ చూపించక పోవడం సిగ్గు చేటని ఆరోపించారు. ఈ ఘటనపై సీఎం చంద్రబాబు, డీజీపీ వెంటనే స్పందించి అరెస్ట్ చేసిన జర్నలిస్టులను బేషరతుగా విడుదల చేయాలని, జర్నలిస్టుల పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.

## వినాయక నిమజ్జనానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

- హంద్రీనీవాలో 3 ప్రాంతాల్లో నిమజ్జనానికి అవకాశాలు: మంత్రి టీజీ భరత్



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి సెప్టెంబర్ 08:**-హంద్రీనీవాలో వినాయక నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేస్తామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సుంకేసులలో నీటి లభ్యత లేని కారణంంగా కె.సి కెనాల్కు నీరు విడుదల చేసే పరిస్థితి కనిపించడం లేదని తెలిపారు. ప్రస్తుత పరిస్థితిని ప్రజలకు వివరిస్తూ మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు.ఈ నెల 2వ తేదీన అధికారులు నిర్వహించిన సమీక్షలో ఈ నెల 14వ తేదీ వరకు మాత్రమే హంద్రీనీవాకు నీరు తీసుకునేందుకు వీలుంటుందన్నారు. అప్పుడు కూడా చిన్న విగ్రహాలు మాత్రమే హంద్రీనీవాలో నిమజ్జనం చేసుకునేందుకు వీలుంటుందని అన్నారు. తాజాగా జిల్లా ఇన్చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, ఇరిగేషన్ ఉన్నతాధికారులతో జరిగిన సమీక్ష సమావేశం తర్వాత ఇప్పటి నుండి మరో 12 లేదా 14 రోజుల వరకు హంద్రీనీవాకు నీటిని తీసుకునేందుకు అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. దీంతో పాటు పెద్ద విగ్రహాలు సైతం నిమజ్జనం చేసుకునేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేస్తామని అధికారులు చెప్పినట్లు మంత్రి తెలిపారు. హంద్రీనీవాలో మూడు రోజుల పాటు అంటే వినాయకుడిని ప్రతిష్ఠించిన తర్వాత 5వ రోజు, 7వ రోజు, 9వ రోజు నిమజ్జనం చేసుకునేందుకు ఇప్పుడున్న పరిస్థితిని బట్టి అవకాశాలు ఉన్నాయన్నారు. ఇందులో ప్రధానంగా 5వ రోజు, 7వ రోజు నీటి లభ్యత ఎక్కువగా ఉంటుందని. నిమజ్జనం చేయడా నికి అత్యంత అనుకూలంగా ఉంటుందని తెలిపారన్నారు. 9వ రోజు నిమజ్జనానికి ఎంతమేర అనుకూ లత ఉంటుందో ఇప్పుడున్న పరిస్థితిని బట్టి ఖచ్చితంగా అంచనా వేయలేమన్నారు. ప్రజలు ఒక అడుగు లేదా అడుగున్నర మట్టి విగ్రహాలు మాత్రమే ఏర్పాటుచేసుకోవాలని ఆయన సూచించారు. ఇక వర్షాలు కురిసేందుకు దేవాదాయ శాఖ తరుపున రాష్ట్ర వ్యాప్తంగా వరుణ యాగం చేయాలని క్యాబినెట్ సమావేశంలో చర్చించామని, కర్నూలులో గాయత్రి గోసేవ సమితి ఆధ్వర్యంలో వరుణ యాగం నిర్వహిస్తామన్నారు. వర్షాలు కురిసి సుంకేసులకు నీరు వస్తే కెసి కెనాల్కు నీరు వస్తుందన్నారు. అప్పుడు అక్కడ నిమజ్జనం చేసుకోవచ్చన్నారు. అయితే ఇప్పుడున్న పరిస్థితిని బట్టి కె.సి కెనాల్లో నిమజ్జనం చేసేందుకు అవకాశం లేదన్నని అర్థం చేసుకొని సహకరించాలని ఆయన ప్రజలను కోరాను.

## వైవీయూలో మూలికా వైద్యంపై జాతీయ కార్యశాల

- ఈ నెల 25న నిర్వహణ.. ఫ్లయర్ ఆవిష్కరించిన వీసీ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్



**కడప మన జనప్రగతి సెప్టెంబర్ 08:**-కడపలోని యోగి వేమన విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో "మూలికా వైద్యం ప్రస్తుత ధోరణులు,పరిశోధన ఆవిష్కరణలు,భవిష్యత్ అవకాశాలు" అనే అంశంపై ఈ నెల 25న జాతీయ కార్యశాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కార్యశాలకు సంబంధించిన ఫ్లయర్ను విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ మంగళవారం ఆవిష్కరించారు.ఔషధ మొక్కలు, మూలికా వైద్యం,మొక్కల ఆధారిత ఉత్పత్తులు, వ్యవస్థాపకత తదితర రంగాల్లో జరుగుతున్న పరిశోధనలు, నూతన ఆవిష్కరణలు, భవిష్యత్ అవకాశాలపై ఈ కార్యశాలలో చర్చించనున్నారు. దేశవ్యాప్తంగా ఆయా రంగాల్లో పనిచేస్తున్న ప్రముఖ శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, పరిశోధకులు, నిపుణులుపాల్గొననున్నారు.ఐఎన్ఎస్ఏ సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ ఆర్.ఆర్. రావు, డాక్టర్ సంజప్పతో పాటు ప్రొఫెసర్ షా వల్లి ఖాన్, ప్రొఫెసర్ ఏ.జీ. దాము ప్రముఖ వక్తలుగా హాజరై వివిధ అంశాలపై ప్రసంగించనున్నారు. ఆంధ్రప్రదేశ్ మెడిసినల్ అండ్ అరోమాటిక్ ప్లాంట్స్ బోర్డు సీఈవో శ్రీ ఏ. చంద్రశేఖర్ కీలకోపన్యాసం చేయనున్నారు.ఈ జాతీయ కార్యశాలకు ప్రొఫెసర్ ఏ. మధుసూదనరెడ్డి కన్వీనర్గా, ప్రొఫెసర్ టి. చంద్రశేఖర్, ప్రొఫెసర్ పి. చంద్ర ఓబుల్రెడ్డి ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా వ్యవహరిస్తున్నారు. ఫ్లయర్ ఆవిష్కరణ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పద్మతో పాటు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## మేయర్ పీఠంపై పుష్పావతి యాదవ్ పేరు

- తిరుపతి టీడీపీలో హాట్ టాపిక్గా మారిన మహిళా నాయకురాలి పేరు



**తిరుపతి మన జనప్రగతి సెప్టెంబర్ 08:**- తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ పీఠం ఎవరిని వరించనుందనే అంశం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అధికార టీడీపీలో మేయర్ అభ్యర్థిత్వంపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో సీనియర్ మహిళా నాయకురాలు వెంకట పుష్పావతి యాదవ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.మూడు దశాబ్దాలుగా రాజకీయ, సామాజిక రంగాల్లో చురుగ్గా ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్న పుష్పావతి యాదవ్కు ప్రజల్లో మంచి పరిచయం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మహిళలు, పేదలు, సామాన్యుల సమస్యలపై స్పందిస్తూ వారి తరఫున పోరాడటంతో పాటు, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆమె కీలకంగా వ్యవహరించారని పేర్కొంటున్నాయి.పార్టీకి కష్టకాలంలోనూ అండగా నిలిచి, ఎన్నికల సమయంలో కార్యకర్తలను సమన్వయం చేస్తూ పార్టీ విజయానికి కృషి చేసిన అనుభవం ఆమెకు కలిసొచ్చే అంశంగా చర్చ సాగుతోంది. మహిళా నాయకత్వంతో పాటు యాదవ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిగా ఆమెకు అవకాశం కల్పిస్తే రాజకీయంగా ప్రయోజనం ఉంటుందనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి.అయితే మేయర్ అభ్యర్థిత్వంపై టీడీపీ అధిష్టానం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం వినిపిస్తున్న పేర్లలో పుష్పావతి యాదవ్ పేరు ముందువరుసలో ఉందనే ప్రచారం తిరుపతి రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

## స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలి: ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి

- కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని దిశానిర్దేశం
- పులివెందులలో ఘనంగా ప్రజా దర్బార్ నిర్వహణ





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి సెప్టెంబర్ 08:**-రానున్న మున్సిపల్,స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమరోత్సాహంతో సిద్ధం కావాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం పులివెందులలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన 'ప్రజా దర్బార్' నిర్వహించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలు,కార్యకర్తలను స్వయంగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యల పరిష్కారానికి అధికారులతో ఫోన్లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పార్టీ నాయకులు,కార్యకర్తలనుద్దేశించి ఎంపీ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలనిరాబోయే స్థానిక సంస్థల సమరంలో పార్టీ జెండాను ఎగురవేసేందుకు ప్రతి ఒక్కరూ సైనికుడిలా బాధ్యత తీసుకోవాలని కష్టకాలంలో పార్టీ కోసం నిలబడే ప్రతి నాయకుడికి,కార్యకర్తకు వైఎస్సార్సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్సీపీ ప్రజాప్రతినిధులు,ముఖ్య నాయకులు,కార్యకర్తలు,నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఎన్టీఆర్ భరోసా కొత్త పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ



**మదనపల్లె, మన జనప్రగతి సెప్టెంబర్ 08:**-: ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం కింద కొత్త పింఛన్ల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా సజావుగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛను ప్రయోజనం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాల్లో దరఖాస్తుదారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, దరఖాస్తుల స్వీకరణ, ఆన్లైన్ నమోదు, ఈ-కేవైసీ ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, గీత, చేనేత, మత్స్యకారులు, సంప్రదాయ వృత్తిదారులు తదితర అర్హులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.దరఖాస్తుల ప్రక్రియను పర్యవేక్షించేందుకు నియమించిన ప్రత్యేక అధికారులు వివిధ నియోజకవర్గాల్లోని సచివాలయాలను తనిఖీ చేసి దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, ఆన్లైన్ నమోదు, వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలించారు. దరఖాస్తుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.సెప్టెంబర్ 7 నుంచి 16 వరకులి దరఖాస్తుల స్వీకరణ, ఆన్లైన్ నమోదు, ఈ-కేవైసీ ప్రక్రియ కొనసాగనుంది. లిసెప్టెంబర్ 17 నుంచి 21 వరకులి భౌతిక ధ్రువీకరణ, లి22 నుంచి 24 వరకులి దరఖాస్తుల పరిశీలన, అర్హత నిర్ధారణ జరుగుతుంది. లిసెప్టెంబర్ 25, 26 తేదీల్లోలి బడ్జెట్ ప్రతిపాదనలు, ప్రభుత్వ అనుమతి ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.అర్హులైన వారు తమ పరిధిలోని స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

## ఉత్తమ ఉపాధ్యాయురాలు కృష్ణకుమారికి మంత్రి దుర్గేష్ సత్కారం



**నిడదవోలు మన జనప్రగతి సెప్టెంబర్ 08:**-; రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డుకు ఎంపికైన నిడదవోలు మండలం డి.ముప్పవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు నిచ్చెనకొళ్ల కృష్ణకుమారిని మంత్రి కందుల దుర్గేష్ ఘనంగా సత్కరించారు.మంగళవారం నిడదవోలు క్యాంపు కార్యాలయంలో మంత్రి దుర్గేష్ను కృష్ణకుమారి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఆమెను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.24 ఏళ్లుగా విద్యా రంగంలో సేవలందిస్తూ విద్యార్థుల సమగ్ర వికాసానికి, విద్యా ప్రమాణాల పెంపునకు కృష్ణకుమారి చేస్తున్న కృషి అభినందనీయమని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
09- 09 - 2026

# జంక్‌ఫుడ్ వద్దే వద్దు..

- పాఠశాల విద్యార్థులకు వైవీయూ విద్యార్థుల అవగాహన
- పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం ఆచార్య రియాజున్నిసా




**కడప మన జనప్రగతి సెప్టెంబర్ 08:**–పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని యోగి వేమన విశ్వవిద్యాలయం ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి ఆచార్య రియాజున్నిసా అన్నారు. జాతీయ పోషకాహార వారోత్సవాల్లో భాగంగా వైవీయూ ఫుడ్ టెక్నాలజీ విభాగం అధ్యాపకులు, విద్యార్థులు మంగళవారం వెల్లటూరు మండలంలోని ఓ ప్రాథమిక పాఠశాలను సందర్శించి చిన్నారులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను చిత్రాల ద్వారా వివరించారు. జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచిస్తూ, వాటిని అధికంగా తీసుకోవడం వల్ల కలిగే అనారోగ్య సమస్యలను చిన్నారులకు సులభంగా అర్థమయ్యేలా వివరించారు. సమతుల్య ఆహారం ప్రాధాన్యతను తెలియజేస్తూ, రోజువారీ ఆహారంలో పోషక విలువలు కలిగిన పదార్థాలను తప్పనిసరిగా చేర్చుకోవాలని సూచించారు. అలాగే ఆహార పదార్థాలను వృథా చేయకుండా అవసరమైనంత మేరకే తీసుకోవాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫుడ్ టెక్నాలజీ విభాగం అధ్యాపకులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పేదలకు సీఎంఆర్‌ఎఫ్ ఆర్థిక భరోసా


**- 85 మందికి రూ.38.68 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, ఎల్‌ఓసీలు పంపిణీ**



**నిడదవోలు,మన జనప్రగతి సెప్టెంబర్ 08:**– పేద ప్రజలు ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్యానికి దూరం కాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) ద్వారా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. నిడదవోలు పట్టణంలోని రోటరీ క్లబ్‌లో మంగళవారం నియోజకవర్గానికి చెందిన 85 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 38,68,041 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, ఎల్‌ఓసీ పత్రాలను మంత్రి పంపిణీ చేశారు. వీరిలో 83 మందికి రూ. 33,60,181 విలువైన చెక్కులు, ఇద్దరికి రూ. 5,07,860 విలువైన ఎల్‌ఓసీ పత్రాలు అందించారు. నిడదవోలు నియోజకవర్గంలో ఇప్పటివరకు సీఎంఆర్‌ఎఫ్, ఎల్‌ఓసీ, ప్రత్యేక ఆర్థిక సాయం ద్వారా 1,177 మందికి రూ. 8.04 కోట్లకు పైగా లబ్ధి చేకూర్చినట్లు మంత్రి తెలిపారు. తీవ్ర అనారోగ్యం, ప్రమాదాల సమయంలో నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ ఆర్థికంగా అండగా నిలుస్తోందన్నారు. అర్హులైన వారికి ప్రతి 15 రోజులకు ఒకసారి ఆర్థిక సాయం అందించే ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. అలాగే సెప్టెంబర్ 7 నుంచి కొత్త పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని, అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్లు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యం

- 'కరెంటోళ్ల జన బాట'లో ఎస్ఈ శ్రీనివాసులు
- ప్రజలు, రైతులతో నేరుగా మాట్లాడి సమస్యలపై ఆరా



**వేముల మన జనప్రగతి సెప్టెంబర్ 08:**–రైతులకు వ్యవసాయ విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడడంతో పాటు, వారి సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని సత్వరమే పరిష్కరించడమే తమ లక్ష్యమని కడప విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసులు తెలిపారు. రైతులు వ్యవసాయ విద్యుత్‌కు సంబంధించి ఏవైనా సమస్యలు ఎదుర్కొంటే వెంటనే విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు 'కరెంటోళ్ల జన బాట' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం మండల పరిధిలోని వేముల, వేల్పుల గ్రామాల్లో ఆయన పర్యటించారు. పులివెందుల డివిజన్ ఈఈ నాగేంద్ర ప్రసాద్, వేంపల్లి ఏడీఈ రఘుతో కలిసి ఎస్ఈ శ్రీనివాసులు ముందుగా వేముల సెక్షన్ కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం వేముల, వేల్పుల విద్యుత్ ఉపకేంద్రాలను తనిఖీ చేసి విద్యుత్ సరఫరా, నిర్వహణకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై వివరాలు తెలుసుకుని వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం వేల్పుల ఎస్సీ కాలనీలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ వ్యవస్థను పరిశీలించారు. సౌర విద్యుత్ ద్వారా అందుతున్న సేవలపై లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం గ్రామ ప్రజలతో నేరుగా మాట్లాడి విద్యుత్ సరఫరా, సిబ్బంది అందుబాటు తదితర అంశాలపై ఆరా తీశారు. ప్రజల నుంచి వచ్చే విద్యుత్ సమస్యలపై సిబ్బంది తక్షణమే స్పందించి పరిష్కరించాలని ఎస్ఈ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ విద్యుత్ సరఫరా పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీనివాసులు, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ శేఖర్, లైన్ ఇన్‌స్పెక్టర్ కిషోర్‌బాబు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



# అంగన్‌వాడీలు, పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందించాలి

- రేషన్ పంపిణీలో ఎలాంటి అవకతవకలకు తావివ్వొద్దు
- ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్ రెడ్డి



**మద్రిపూడి మన జనప్రగతి సెప్టెంబర్ 08:**–అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్ రెడ్డి అధికారులను ఆదేశించారు. చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మద్రిపూడి మండలంలోని గార్లపేట, వేమవరం, మద్రిపూడి ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, చౌక ధరల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కూచిపూడి హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం నాణ్యతపై తల్లిదండ్రులు, విద్యార్థులు ఫిర్యాదు చేయడంతో వెంటనే స్పందించారు. తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడి త్రిసభ్య కమిటీతో విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంగన్‌వాడీల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారం నాణ్యత, సరుకుల నిల్వలు, రికార్డులను పక్కాగా పరిశీలించాలని సూచించారు. చౌక ధరల దుకాణాల్లో ఈ–పోస్, తూకం యంత్రాలు, రేషన్ బియ్యం నాణ్యత, నిల్వల వివరాలను తనిఖీ చేసి కార్డుదారులకు సక్రమంగా రేషన్ అందించాలని ఆదేశించారు. పాఠశాలలు, హాస్టళ్లలో రోజువారీ మెనూ ప్రకారం వేడివేడి భోజనం అందించాలని, వంటశాలల పరిశుభ్రత, సరుకుల నాణ్యతను పర్యవేక్షించాలని తెలిపారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందాలని, అవకతవకలను సహించేది లేదని హెచ్చరించారు. వేమవరం అంగన్‌వాడీ కేంద్రంలో ఇండక్షన్ స్టవ్, సామగ్రి కోసం టేబుల్ ఏర్పాటుకు అంగన్‌వాడీ టీచర్‌కు తన సొంత నగదు నుంచి రూ. 2 వేలు అందించారు. రావెళ్లవారిపాలెం కేజీబీవీలో పదో తరగతిలో 577 మార్కులు సాధించిన విద్యార్థిని అభినందించి, చేతి గడియారం కొనుగోలుకు రూ. 2 వేలు అందించారు.

# మట్టి గణపతులను పూజిద్దాం

**- పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములమవుదాం: కమిషనర్ ఎం.జయకృష్ణ పిలుపు**



**తిరుపతి మన జనప్రగతి సెప్టెంబర్ 08:**–నగర ప్రజలందరూ మట్టి గణపతులను పూజించి పర్యావరణ పరిరక్షణలో ఇతోధికంగా భాగస్వాములు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ ప్రజలకు పిలుపునిచ్చారు. ఇందిరామైదానం లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో ఏర్పాటు చేసిన వినాయక చవితి మంటపాల అనుమతుల మంజూరు హెల్ప్ లైన్ సెంటర్ ను మంగళవారం కమిషనర్ సందర్శించారు. వినాయక చవితికి మంటపాల అనుమతుల ధ్రువపత్రాలను మంజూరు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నిమజ్జన ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో ఈ కేంద్రం ఏర్పాటు చేయడం సంతోషకరమని తెలుపారు. నగరంలో వినాయక చవితి వేడుకలు భక్తిభావంతో జరుపుకునేందుకు అందరూ సహకరించాలని తెలిపారు. చవితి వేడుకలు నిర్వహించే వారు మంటపాల ఏర్పాటుకు అన్ని విభాగాల అధికారుల కార్యాలయాలకు వెళ్లకుండా ఒకే చోట అన్ని అనుమతులు ఇచ్చేలా ఈ సింగిల్ విండో కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నిర్వాహకులు అందరూ ఇక్కడ అనుమతులు తప్పకుండా తీసుకోవాలని తెలిపారు. నగరంలో చవితి వేడుకల నిర్వహణపై ఇప్పటికే పలు సూచనలు, నిబంధనలు తెలియజేయడం జరిగిందని తెలిపారు. అందరూ వాటిని తప్పకుండా పాటించాలని, భక్తి భావంతో ఆనందంగా వినాయక చవితి వేడుకలు నిర్వహించాలని తెలిపారు. నిమజ్జనం రోజు ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా జాగ్రత్తలు పాటించాలని, ఉత్సవ కమిటీ నిబంధనలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పిడిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఉత్సవ కమిటి కన్వీనర్ సామంచి శ్రీనివాస్, సభ్యులు ఆర్.సి.మునికృష్ణ, నవీన్ కుమార్ రెడ్డి, గుండాల గోపినాథ్, మాంగాటి గోపాల్ రెడ్డి, పలువురు పాల్గొన్నారు.

# రామచంద్రపురం అభివృద్ధి పనులపై మాజీ కార్పొరేటర్ పుష్పనగేష్ ఫోకస్



**పటాన్ చెరువు మన జనప్రగతి సెప్టెంబర్ 08:**– రామచంద్రపురం డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు వివిధ కాలనీలలో కొత్త పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ రామచంద్రపురం తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ సీఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమీన్పూర్ సర్కిల్ కార్యాలయంలో సీఎంసీ ఇంజనీరింగ్ ఎస్ఈ శంకర్ నాయక్, ఈఈ వెంకటరమణ, ఏఈ శివకుమార్‌లతో సమావేశమై డివిజన్‌లో నెలకొన్న పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. సాయి నగర్ కాలనీ, సాయి జ్యోతి కాలనీ, మల్లికార్జున నగర్, రామచంద్రారెడ్డి నగర్, మయూరి నగర్, శ్రీ సాయి నగర్ కాలనీ, కాకతీయ నగర్, అశోక్ నగర్, వినాయక నగర్, కనుకుంట ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని వినతిపత్రం సమర్పించారు. గతంలో మంజూరైన ఓల్డ్ రామచంద్ర మీట్ మార్కెట్ అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని, పాషా కాలనీలో ఓపెన్ డ్రైన్ మరియు సీసీ రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కోరారు. అలాగే శ్రీనివాస్ నగర్ కాలనీ మస్జిద్ వద్ద సీసీ రోడ్డు, శ్రీ సాయి నగర్ కాలనీలో సీసీ రోడ్లు మరియు ఓపెన్ డ్రైన్ల నిర్మాణం, వినాయక నగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులు ఇంకా ప్రారంభం కాకపోవడంపై అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. డివిజన్‌లోని పలు కాలనీలలో చిన్నచిన్న అభివృద్ధి పనులు పూర్తికాక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించాలని అధికారులను కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధుల మంజూరు విషయంలో సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అధికారులు ప్రతిపాదించిన పనులను పరిశీలించి, అర్హత కలిగిన అభివృద్ధి కార్యక్రమాలను దశలవారీగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం. స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టడం ద్వారా డివిజన్‌ను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు కృషి కొనసాగుతుందని పుష్పనగేష్ తెలిపారు.

# ఘనంగా నాగెళ్ళ సాంబశివరెడ్డి ముందస్తు జన్మదిన వేడుకలు

**వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 66వ జన్మదిన వేడుకలు**

**శాలువాతో సత్కరించి కేక్ కట్ చేయించిన నాయకులు**



**వేముల మన జనప్రగతి సెప్టెంబర్ 08:**–వేముల మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నాగెళ్ళ సాంబశివరెడ్డి 66వ జన్మదినం సందర్భంగా మంగళవారం వేములలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ముందస్తు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ చల్లా గంగాదేవి వెంకటనారాయణ, సీనియర్ నాయకులు వంగాల సూర్యనారాయణరెడ్డి, యాదవ నాయకులు ఆర్. శ్రీనివాసులు, జిల్లా యువజన విభాగం కార్యనిర్వాహక సభ్యులు చల్లా సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాగెళ్ళ సాంబశివరెడ్డిని శాలువాతో సత్కరించి, కేక్ కట్ చేయించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్‌రెడ్డి, పేర్ల రామసుబ్బారెడ్డి, ఎద్దుల విజయభాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నాగభూషణ్‌రెడ్డి, పీబీవీ భాస్కర్‌రెడ్డి, సోహైల్, నాగప్ప, జర్మియా, నాగభూషణం, పుంజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పొలం పిలుస్తోంది..ప్రకృతి సాగు వైపు అడుగులు

**రైతులకు అంతర పంటల సాగుపై అవగాహన**

**200 లీటర్ల జీవామృతం తయారీ**

**బయో రీసోర్స్ సెంటర్ పరిశీలన**




**వేముల మన జనప్రగతి సెప్టెంబర్ 08:**–ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ రైతులను అంతర పంటల సాగు వైపు ప్రోత్సహించేందుకు వేముల మండల పరిధిలోని వెంకటేశ్వరపురంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి జి.పి. ఓబులేసు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ రైతులు చందా రాజీవ్‌రెడ్డి, సంగిరెడ్డి సాగు చేస్తున్న మూడు ఎకరాల చీని పంట పొలాన్ని పరిశీలించారు. చీని పంటలో ఏ గ్రేడ్ నమూనాలో ఆకుకూరలతో పాటు ఎనిమిది రకాల కూరగాయలను అంతర పంటలుగా సాగు చేస్తున్న విధానాన్ని అధికారులు పరిశీలించారు. ఒక పంటకు మార్కెట్‌లో ఆశించిన ధర లభించకపోయినా, మరో పంట ద్వారా ఆదాయం పొందే అవకాశం ఉంటుందని రైతులకు వివరించారు. పంటల వైవిధ్యంతో వ్యవసాయంలో నష్టాలను తగ్గించుకోవడంతో పాటు అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో ఉపయోగించే జీవామృతం, వివిధ రకాల కషాయాల తయారీ, వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతుల సమక్షంలో 200 లీటర్ల జీవామృతాన్ని ప్రత్యక్షంగా తయారు చేయించి, దాని తయారీ విధానాన్ని వివరించారు. అనంతరం రాజీవ్‌రెడ్డి బయో రీసోర్స్ సెంటర్‌ను మండల వ్యవసాయ అధికారి పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతులు మరింతగా అవలంబించాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు నియాజ్,కిషోర్‌నాయక్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఫార్మర్ మాస్టర్ ట్రైనర్లు ఎం.రామ్మోహన్‌నాయుడు,కృష్ణయ్య,అంజన్‌రెడ్డి,వెంకటేష్,ఐసీఆర్‌పీలు,రాజీవ్‌రెడ్డి,నరసింహులు, రైతులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన పెంచుకోవాలి



**ఆళ్లగడ్డ మన జనప్రగతి సెప్టెంబర్ 08:** ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన పెంచుకోవాలని కంటి వైద్యులు రమేష్ అన్నారు. 41 వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో నేత్రదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కంటి పరీక్షలను నిర్వహించారు. నేత్రదానం గురించి పాఠశాల విద్యార్థులతో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి వైద్యులు మాట్లాడుతూ ఒక్కరూ నేత్రదానం చేసిన ఇద్దరికి కంటి చూపును ఇవ్వవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత , ఆప్తాలమిక్ ఆఫీసర్ రమేష్ , స్టాఫ్ నర్స్ శంకరమ్మ , ఆశా వర్కర్ హనుమంతమ్మ మరియు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా సేవ,సుపరిపాలనే ధ్యేయం

- పార్టీ-ప్రభుత్వ సమన్వయంతో ముందడుగు
- లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి



**అమరావతి /పులివెందుల అర్బన్ మన జనప్రగతి సెప్టెంబర్ 08:**తెలుగుదేశం పార్టీ బలోపేతంతో పాటు రాష్ట్రంలో ప్రజా సేవ, అభివృద్ధి,సుపరిపాలనే ప్రధాన లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేస్తున్నాయని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రతిష్టాత్మక 'టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్'లో రాంగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.ప్రజల సమస్యలకు వేగవంతమైన పరిష్కారాలు చూపడం, అభివృద్ధి,సంక్షేమం, సమర్థవంతమైన పాలనకు సమాన ప్రాధాన్యతనిస్తూ పాలనను ప్రజల ముంగిటకు చేర్చడం,ప్రజాప్రతినిధులు నిరంతరం ప్రజల్లో ఉంటూ జవాబుదారీతనంతో పనిచేయడం.క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేసి ప్రజలకు చేరువ కావడం,ప్రభుత్వ సంక్షేమ పథకాలు,పార్టీ విధానాల మధ్య సమన్వయం సాధిస్తూ పనిచేయడం వివిధ విధానాలపై చర్చించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, ఎంపీలు,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,పొలిట్‌బ్యూరో సభ్యులు,జోనల్ ఇన్‌చార్జ్‌లు,నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు మరియు పార్లమెంట్ పరిశీలకులు తదితర ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ధర్మవరంలో మెగా జాబ్ మేళా విజయవంతం

- 135 కంపెనీల్లో
1,146 మందికి ఉద్యోగాలు



**ధర్మవరం, మన జనప్రగతి సెప్టెంబర్ 08:-** ధర్మవరం పట్టణంలోని సిఎన్బీ ఫంక్షన్ హాల్‌లో సంస్కృతి సేవా సమితి సహకారంతో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు నిరుద్యోగ యువత భారీగా తరలివచ్చారు. మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్, ప్రభుత్వ గౌరవ సలహాదారు జి. సతీష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.జాబ్ మేళాలో 135 కంపెనీలు పాల్గొనగా, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,100 మంది యువత హాజరయ్యారు. వీరిలో 1,146 మందికి పైగా వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. టీసీఎస్, యాక్సెంచర్, క్యాప్‌జెమినీ, హెచ్‌సీఎల్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, కియా ఇండియా, టాటా మోటార్స్, ఫాక్స్‌కాన్, హ్యుందాయ్ మొబిస్, అరబిందో ఫార్మా తదితర ప్రముఖ సంస్థలు పాల్గొన్నాయి.మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, ఉద్యోగం యువత భవిష్యత్తుకు తొలి మెట్టు అన్నారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. యువత ఉద్యోగాల కోసం ఇతర నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా కంపెనీలను ధర్మవరానికి తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. జాబ్ మేళా ఒక్కరోజు కార్యక్రమం కాదని, యువతకు నిరంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని స్పష్టం చేశారు.జి. సతీష్ రెడ్డి మాట్లాడుతూ సత్యసాయి జిల్లా రాబోయే రోజుల్లో ప్రముఖ పారిశ్రామిక జిల్లాగా అభివృద్ధి చెందనుందని, వేలాది ఉద్యోగ అవకాశాలు రానున్నాయని తెలిపారు. కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ యువత విద్యార్హతలతో పాటు కమ్యూనికేషన్, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఎంపికైన యువతకు మంత్రి, జి. సతీష్ రెడ్డి నియామక పత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామిక సంస్థల ప్రతినిధులు, నిరుద్యోగ యువత తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి సవితమ్మతో టిడిపి నేతలు ఆత్మీయ సమావేశం



**కడప మన జనప్రగతి సెప్టెంబర్ 08:-**మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో పాల్గొన్న అనంతరం,విజయవాడలోని జయభేరి క్లబ్‌హౌస్‌లో కడప జిల్లాకు చెందిన టీడీపీ నాయకులకు కడప జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీమతి సవితమ్మ ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి , ప్రభుత్వ విప్,కడప ఎమ్మెల్యే మాధవి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి సవితమ్మ ప్రజాప్రతినిధులు,టీడీపీ నాయకులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ,కడప జిల్లాలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై చర్చించారు.ప్రజాప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ కడప జిల్లాను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని, రాబోయే స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులను ఘన మెజారిటీతో గెలిపించేందుకు కలిసికట్టుగా పనిచేయాలని మంత్రి సవితమ్మ దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో కడప జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థుల ధర్నాతో 'శ్యామ్'కు సంబంధం లేదు.!

**మా సంస్థ ద్వారా పోలీసులను తయారు చేశాను గానీ నేరస్తులను కాదు**

**'శ్యామ్' పై పోలీసు దాడుల పట్ల కన్నీటి ఆవేదన**



**కాకినాడ మన జనప్రగతి సెప్టెంబర్ 08:-**పోలీసు నియామకాల భర్తీ ప్రక్రియ చేపట్టాలని కోరుతూ నిర్వహించిన ధర్నాకు "శ్యామ్ సంస్థ" కు విద్యార్థులు ఎటువంటి సంబంధం లేదని తాను తన శ్యామ్ ఇన్స్టిట్యూట్ అనే సంస్థ ద్వారా సమాజంలో ఉన్నత విలువలు కలిగిన పోలీసులను మాత్రమే తయారు చేయాలనుకుంటున్నానే గానీ నేరస్తులను తయారు చేయాలని ఉద్దేశం తనకు ఎటువంటి ఆలోచన లేదని శ్యామ్ అధినేత గుంటూరి శ్యామ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం తెల్లవారుజామున శ్యామ్ వసతి గృహంపై పోలీసులు దాడులు చేసి తనతో పాటు విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేయడం పట్ల ఆయన మీడియా ముందు కన్నీళ్ల పర్యంతమయ్యారు. మంగళవారం ఇన్స్టిట్యూట్లో శ్యామ్ సంస్థ డైరెక్టర్ శ్యామ్ పోలీసుల దాడులకు సంబంధించి విలేకరులకు వివరాలను వెల్లడించారు.ఈ సందర్భంగా శ్యామ్ మాట్లాడుతూ సోమవారం కాకినాడలో పోలీసు ఉద్యోగాలు భర్తీ చేయాలంటూ విద్యార్థులు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించారన్నారు. దానిపై తనను పోలీసులు సోమవారం మధ్యాహ్నం పిలిచి రాత్రి వరకు విచారణ చేపట్టి పంపారని చెప్పారు మంగళవారం ఉదయం తెల్లవారుజామునే వసతి గృహం పై పోలీసులు దాడులు చేసి విద్యను అభ్యసిస్తున్న వారిని భయభ్రాంతులకు గురి చేశారన్నారు. పోలీసులు తగిన రీతిలో బదిలీచానని అయినా దాడులు చేయడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై ఏదో కుట్ర కోణం ఉందని చెప్పారు. తాను ఎవరితోను వైరం లేదని అందరితోని సన్నిహితంగా ఉంటానని పోలీసులు ఇలా దాడులు చేసి సంస్థ ప్రతిష్టను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను తన భార్య ఉన్నత స్థాయి ప్రభుత్వ ఉద్యోగాలను వదులుకొని 26 సంవత్సరాల నుంచి సంస్థ అభివృద్ధి కోసం విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో దీనిని ఏర్పాటు చేశామన్నారు. తాను ఎన్నో సమస్యలు ఎదుర్కొని కూలి పని చేసుకుంటూ ఈ స్థితికి చేరిన వాడినని ఈ సంస్థపై నమ్మకంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పోలీసు ఉద్యోగాల కోసం శిక్షణ నిమిత్తం చేరుతున్నారన్నారు. శిక్షణ పూర్తయిన అభ్యర్థులు చాలా కష్టాలు ఎదుర్కొంటున్నారని ఒకే గదిలో ఇద్దరు ముగ్గురు ఉంటూ తిండి లేక కష్టాలు పడుతున్న తీరుని చూసి తాను ఆవేదన చెందుతున్నట్లు చెప్పారు.అందులో భాగంగా సీఎం చంద్రబాబును కలిసి పోలీసు శాఖలో ఉద్యోగాలు పెంచాలని కోరుతూ ఒక వినతిపత్రం అందించినట్లు కూడా శ్యామ్ గుర్తు చేశారు. విద్యార్థుల పైన కేసులు పెట్టినట్లు పోలీసులు చెప్పారని వారిపై ఎత్తివేయాలని తనపై పెట్టిన కేసుపై న్యాయపోరాటం చేస్తానని చెప్పారు.తన సమయాన్ని విద్యార్థులకు కేటాయించి వారిని ఉన్నత స్థితిలో చేర్చేందుకే కేటాయిస్తానని చెప్పారు. తన సంస్థపై జరిగిన దాడులకు సంబంధించి వివరాలు తెలుసుకుంటున్నానని తెలిసిన వెంటనే బహిర్గతం చేస్తానని శ్యామ్ విలేకరులకు చెప్పారు. ఇప్పటివరకు తమ ఇన్స్టిట్యూట్ ద్వారా 25 వేల మంది పోలీసులు (యూనిఫాం) ఉద్యోగాలు పొందారని శ్యామ్ చెప్పారు.

# వేంపల్లెలో పారిశుద్ధ్య కార్మికుల మెరుపు సమ్మె

- పీఎఫ్ బకాయిలు,వేతనాల కోసం గ్రామపంచాయతీ ఎదుట నిరసన.
- అధికారుల తప్పిదమే ఇందుకు కారణం
- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాదుల్లా



**వేంపల్లె మన జనప్రగతి సెప్టెంబర్ 08:-**వేంపల్లి మేజర్ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు మంగళవారం మెరుపు సమ్మె దిగారు. పీఎఫ్ బకాయిలు, వేతనాలు చెల్లించాలంటూ వారు విధులు బహిష్కరించి వేంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేసి నిరసనకు చేపట్టారు . పంచాయతీలో పనిచేస్తున్న 48 మంది పారి పారిశుద్ధ్య సిబ్బందికి 30 నెలల పిఎఫ్ బకాయిలు, రెండు నెలల వేతనాలు చెల్లించాల్సి ఉంది. ఈ విషయమై గతంలోనూ సదరు సిబ్బంది ఆందోళన చేసినా అధికారులు మీ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చి సాంకేతిక కారణాల బూచితో ఆ సమస్యను పరిష్కరించలేదు. దీంతో కడుపు మండిన కార్మికులు గ్రామపంచాయతీ కార్మికులు నిరసనకు దిగారు. కార్మికులకు మద్దతుగా నిరసనలో పాల్గొన్న ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కెసి బాదుల్లా మాట్లాడుతూ కార్మికులు పనులు బంద్ నిలుపుదల చేసిన దుస్థితికి అధికారులే బాధ్యత వహించాల్సి ఉందన్నారు.2025 అక్టోబరు, నవంబరు డిసెంబరు, మాసాలకు సంబంధించిన వేతనాలు ఇదిగో అప్పుడు ఇస్తాం ఇప్పుడు ఇస్తామంటూ అధికారులు కాలయాపన చేస్తూ వస్తున్నారే తప్ప ఆచరణలో సాధ్యం కావడం లేదన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలనీ కోరారు. ఆరు నెలల అరియర్స్ డబ్బులు అధికారుల చేసిన తప్పిదాలకు కార్మికులు బలి కావాల్సి వస్తున్నదని తెలిపారు. పంచాయతీ అధికారులు 30 నెలలుగా కార్మికుల వేతనాల నుంచి కటింగ్ చేసిన పీఎఫ్ డబ్బులు కార్మికుల ఖాతాల్లో ఎందుకు జమ చేయడం లేదని ప్రశ్నించారు. స్వర్ణ గ్రామపంచాయతీ ఆన్లైన్ అని పేరు చెబుతా కార్మికుల సంక్షేమం పట్ల తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రాణాలను ఘనంగా పెట్టి ప్రజల ఆరోగ్యాలకు పాటుపడుతున్న పంచాయతీ కార్మికుల చట్టపరంగా ఇవ్వాల్సిన సబ్బులు కొబ్బరి నూనె బ్లౌజులు మాస్కులు పోరకలు,దోటీలు ఇవ్వడం లేదన్నారు. కూటమి ప్రభుత్వ పరిపాలనలో సాక్షాత్తు మాజీ ముఖ్యమంత్రి నియోజకవర్గంలోనే కార్మికుల దుస్థితి ఇలా ఉంటే రాష్ట్రవ్యాప్తంగా ఎలా ఉంటుందో అర్థం కావడం లేదన్నారు. కాగా తమ సమస్య పరిష్కారమయ్యే వరకు సమ్మె విరమించేది లేదని కార్మికుల ప్రకటించారు, ఈ విషయమై గ్రామపంచాయతీ గాండ్ల కవిత, డిప్యూటీ ఎంపీడీవో కాలింగిరి రమణయ్య మాట్లాడుతూ స్వర్ణ పంచాయతీ పోర్టల్ సమస్య వల్లే వారికి ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వలేకపోతున్నామన్నారు.ఈ సమస్య రాష్ట్ర వ్యాప్తంగా ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు పి సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా రంగంలో అత్యంత స్ఫూర్తిని నింపుతోన్న స్మార్ట్ కిచెన్ వ్యవస్థ






**నిర్వహణపై ప్రశంశల వర్షం కురిపించిన "జైకా" ప్రతినిధి యుమికో ఓనిషి**

**నీతీ ఆయోగ్ ఆరోగ్యం పోషణ ప్రత్యేక నిపుణులు మోహిత్ సూద్**



**చెన్నూరు మన జనప్రగతి సెప్టెంబర్ 08:-** చెన్నూరు మండలం కొండపేట జెడ్పి హైస్కూలులోని స్మార్ట్ కిచెన్ నిర్వహణ తీరును మంగళవారం పరిశీలించిన జైకా టీమ్ లీడర్ యుమికో ఓనిషి.నిర్వహణా తీరును ఒక్కొక్క విభాగం వారీగా జైకా,నీటీ ఆయోగ్ ప్రతినిధులకు క్షుణ్ణంగా వివరించిన కడపజిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.అనంతరం చెన్నూరు మండల కేంద్రంలోని చెన్నూరు జిల్లా పరిష బాలికల ఉన్నత పాఠశాల జూనియర్ కళాశాలలో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం అమలును పరిశీలించిన జైకా ప్రతినిధి యుమికో ఓనిషిస్మార్ట్ కిచెన్ ద్వారా సరఫరా చేయబడిన మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి స్వయంగా విద్యార్థులతో కలిసి విద్యార్థులతో కలిసి రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేసిన జైకా ప్రతినిధి యుమికో ఓనిషి విద్యార్థినులతో పాటు ముగ్గురు సహపంక్తి భోజనాన్ని చేసిన జైకా ప్రతినిధి యుమికో, నీతీ ఆయోగ్ ప్రతినిధి మోహిత్ సూద్,జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరివారితోపాటు మధ్యాహ్న భోజనాన్ని పిల్లలతో కలిసి భోంచేసిన జేసీ డా.నిధిమీనా,సమగ్ర సర్వ శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏపీ సి అనురాధ డి ఆర్ డి ఏ తెలుగు పిడి రాజలక్ష్మి అధికారులు పిల్లలతో కలిసి భోజనం చేశారు,ఈ సందర్భంగా స్మార్ట్ కిచెన్ వ్యవస్థ, మధ్యాహ్న భోజనం పథకంపై పిల్లలు తయారీ చేసిన పోస్టర్లను చదివి వినిపించిన జిల్లా కలెక్టర్.విద్యార్థులు, స్టాఫ్ అందరితో ఫోటో షూట్ లో పాల్గొన్న అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడి..స్మార్ట్ కిచెన్ వ్యవస్థ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసిన జైకా ప్రతినిధి యుమికో ఓనిషి మాట్లాడుతూ విద్యారంగంలో అత్యంత స్ఫూర్తిని నింపుతున్న స్మార్ట్ కిచెన్ వ్యవస్థ నిర్వహణపై ప్రశంసల వర్షం కురిపించారు, పిల్లలతో కలిసి సమిష్టి భోజనం చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు, ఈ కార్యక్రమంలో డీఈవో శంషుద్దీన్, తాసిల్దార్ విజయకుమారి, మండల విద్యాశాఖ అధికారులు, సునీత 1 సునీత 2 వెలుగు ఏపిఎం వెంకటేష్ స్థానిక అధికారులు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు,

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174